

## అదుపులోకి రాని అతిసార

- జబ్బరుతోటలో మరో నలుగురికి డయేరియా
- మొత్తం బాధితుల సంఖ్య 53

జబ్బరుతోటలో అతిసార ఇంకా అదుపులోకి రాలేదు. శుక్రవారం మరో నలుగురు డయేరియా బారినపడ్డారు. దీంతో బాధితుల సంఖ్య 53కి చేరింది. అందులో కొందరు ఆస్పత్రిలో, మరికొందరు ఇంటి వద్ద ఉండి చికిత్స పొందుతున్నారు.

-8లో

# గంజాయిపై ఉక్కుపాదం

త్వరలో విశాఖ కేంద్రంగా ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

- ప్రభుత్వం ప్రకటన
- గంజాయి, డ్రగ్స్‌పైనే ప్రత్యేకంగా నిఘా
- సమాచారం కోసం 1972 టోల్‌ఫ్రీ నంబర్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గంజాయి మాఫియాపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గంజాయి సాగు, రవాణా, విక్రయం, వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు విశాఖలో కూడా 'ఈగల్' టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటుచేస్తున్నట్టు ప్రకటించింది.



దువ్వాడలో తమిళనాడుకు చెందిన మహిళ వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

- వార్త మెయిన్ 2లో

విశాఖ ఏజెన్సీలో సాగవుతున్న గంజాయి రాష్ట్రంతో పాటు దేశ, విదేశాలకు సరఫరా అవుతోంది. గంజాయి వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతోంది. గంజాయి మత్తులో యువత చోరీలకు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో నేరాల పెరుగుదలకు గంజాయి ప్రధాన కారణంగా మారుతోంది. ముఖ్యంగా వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల గంజాయి వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. తాము అధికారంలోకి వస్తే గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని ఎన్నికల సమయంలో తెలుగుదేశం అధినేత ఎన్.చంద్రబాబు నాయుడు, ఆ పార్టీ నాయకుడు నారా లోకేశ్, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. ఆనాడు చెప్పినట్టుగానే గంజాయి సాగు, విక్రయం, రవాణా, వినియోగంపై పూర్తిస్థాయిలో ఉక్కుపాదం మోపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం ఐజీ స్థాయి అధికారి సారథ్యంలో 'ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్' (ఈగల్)ను తాజాగా ఏర్పాటుచేసింది. రాష్ట్రంలో మంగళగిరి కేంద్రంగా నార్కోటిక్ పోలీస్ స్టేషన్, విశాఖ, పాడేరు, అమరావతిలో స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందాలు, ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఈగల్ సెల్ ఏర్పాటుచేస్తున్నట్టు ప్రకటించింది. నార్కోటిక్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా ఉంటే, స్టేట్ టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్లలో సీఐ స్థాయి అధికారులు, జిల్లా కేంద్రాల్లోని ఈగల్ సెల్‌లో ఎస్ఐ స్థాయి అధికారులను ఇన్‌చార్జులుగా నియమించే అవకాశం ఉంది. 'ఈగల్' బృందాలు కేవలం డ్రగ్స్, గంజాయిపైనే నిఘా ఉంచడం, దాడులు చేయడం చేస్తాయి. ఎవరైనా డ్రగ్స్, గంజాయి విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా, చివరకు వినియోగిస్తున్నా సరే సమాచారం అందించేందుకు వీలుగా 1972 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా గంజాయి రవాణా, విక్రయం, వినియోగానికి అడ్డుకట్ట పడుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

ఏజెన్సీలో సాగవుతున్న గంజాయిని స్మగ్లర్లు ఏదో ఒక మార్గంలో నగరానికి తీసుకువస్తున్నారు. ఏజెన్సీ నుంచి వచ్చే మార్గాల్లో నగర సరిహద్దులో ఉండే దువ్వాడ, పెందుర్తి వంటి ప్రాంతాల్లో ఇళ్లను అద్దెకు తీసుకుని అక్కడ నిల్వ చేస్తున్నారు. కొందరు నగరంలోకి తీసుకొచ్చి హోటళ్లు, అద్దె ఇళ్లలో ఉంచుతున్నారు. ఒకవిధంగా చెప్పుకోవాలంటే గంజాయి స్మగ్లర్లు గంజాయిని ఇతర నగరాలు, రాష్ట్రాలకు తరలించేందుకు నగరాన్ని ఒక ట్రాన్సిట్ హాల్ట్ మాదిరిగా తయారుచేసుకున్నారు. నగరంలోకి చేర్చిన గంజాయిని అదను చూసుకుని రైళ్లు బస్సులు, కొరియర్, ప్రత్యేక వాహనాల ద్వారా ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలోనే నగరంలో కూడా గంజాయి లభ్యత, వినియోగం పెరిగిపోయాయి. గంజాయి మత్తులో వారంతా నేరాలకు, అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. పట్టపగలే గంజాయి సేవించి

... మిగతా 6వ పేజీలో

# మరో రెండు రైతుబజార్లు

- పీఎం పాలెం, పెందుర్తిల్లో ఏర్పాటు
- త్వరలో అందుబాటులోకి ఆరిలోవ, చిట్టివలస బజార్లు
- రైతుబజార్ల చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగిస్తాం
- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):

వినియోగదారుల డిమాండ్ మేరకు పోతినమల్లయ్యపాలెం, పెందుర్తిల్లో కొత్తగా రైతుబజార్లు ఏర్పాటుకు ప్రతిపాదించామని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. శుక్రవారం తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ రెండుచోట్లా రైతుబజార్ల ఏర్పాటు కోసం స్థలం చూస్తున్నామన్నారు. పెందుర్తిలో ఒక రైతుబజార్ ఉన్నా మరో ప్రాంతంలో ఏర్పాటుచేస్తామన్నారు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన ఆరిలోవ, చిట్టివలస రైతుబజార్లను కూడా త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ రెండు బజార్లలో కార్యకలాపాలు చేపట్టేందుకు కొంత మేర నిధులు అవసరమని పేర్కొన్నారు. నగరంలో ఎంవీపీ కాలనీ, సీతమ్మధార, కంచరపాలెం, నరసింహనగర్, మధురవాడ రైతుబజార్ల చుట్టూ ఉన్న ఆక్రమణలపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. జీవీఎంసీ, పోలీసుల సాయంతో ఆక్రమణలు తొలగిస్తామని పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్ కంటే తక్కువ రేటుకు కందిపప్పు, బియ్యం విక్రయాల్లో రాష్ట్రంలోనే విశాఖపట్నం ప్రథమ స్థానంలో ఉందన్నారు. జిల్లాలోని అన్ని రైతుబజారుల్లో ఎంపిక చేసిన స్టాళ్లలో కందిపప్పు, బియ్యం విక్రయాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 25 వేల టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. మొత్తం 40 రైతు సేవా కేంద్రాల పరిధిలో పది ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ఇప్పటివరకూ 100 టన్నుల ధాన్యం సేకరించామన్నారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఐదు వేల టన్నుల ధాన్యం సేకరించామని, అయితే ఈ ఏడాది లక్ష్యాన్ని మరింత ఎక్కువగా నిర్ణయించినందున అందుకు తగినట్టు ప్రణాళిక రూపొందించుకుని అమలు చేస్తున్నామని జేసీ తెలిపారు. ధాన్యం సరఫరా చేసే రైతులకు సంచులు ఇస్తున్నామని, మిల్లుకు రవాణా, హమాలీ చార్జీలు రైతుల ఖాతాలకు జమ చేస్తున్నామని చెప్పారు.

# వసతి ఓకే... ఆహారమే!

- అధ్వానంగా ఉన్న 30 హాస్టల్ భవనాల ఆధునీకరణ
- అందుబాటులోకి సురక్షిత తాగునీరు, మరుగుదొడ్లు
- కార్పొరేట్ సంస్థల సీఎస్‌ఆర్ నిధులతో అభివృద్ధి పనులు
- కొన్నిచోట్ల ఇప్పటికీ అమలుకాని మెనూ
- నాణ్యమైన భోజనం అందడం లేదంటున్న విద్యార్థులు



సీతమ్మధారలోని ఎస్సీ బాలుర వసతి గృహం

ఆంధ్రజ్యోతి పరిశీలన

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల రూపురేఖలు మారాయి. అధ్వాన పరిస్థితులు, అరకొర వసతుల మధ్య తీవ్ర ఇబ్బందులతో చదువులు సాగించాల్సిన దుస్థితి తప్పడంతో విద్యార్థుల్లో ఆనందం కనిపిస్తోంది. ఆధునికీకరించిన భవనాలు, సరిపడా మరుగుదొడ్లు, సురక్షిత నీరు అందుబాటులోకి రావడంతో సమస్యలు తొలగిపోయాయని చెబుతున్నారు. అయితే ఇప్పటికీ కొన్ని వసతి గృహాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలుకావడం లేదని వాపోతున్నారు. నగర పరిధిలోని పలు వసతి గృహాలను శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు సందర్శించగా, వసతులపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల రూపురేఖలు మార్చేందుకు కలెక్టర్లుగా పనిచేసినవారు యత్నించారు. ఇందులో భాగంగా పలు పరిశ్రమల యాజమాన్యాలను కలిసి విశాఖ విద్యా వసతి వికాసం పేరుతో ఆధునికీకరణ పనులకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. దీంతో కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతగా అందించిన నిధులు, ఎంపీ ల్యాడ్స్, ఇతర నిధులతో హాస్టళ్ల రూపురేఖలు మార్చారు. అధ్వానస్థితికి చేరిన కొన్ని భవనాలను ఆధునికీకరించారు. శిథిలావస్థకు చేరిన

... మిగతా 6వ పేజీలో



వసతి గృహంలో భోజనం తినకుండా పడేస్తున్న దృశ్యం

# అండర్ స్టాండింగే!

- నాలుగు మినహా అన్ని అంశాలకూ సభ్యులు గ్రీన్‌సిగ్నల్
- స్థాయీ సంఘ నిర్ణయాలపై విమర్శలు

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ముందుగా ఊహించినట్టుగానే ముగిసింది. ఎజెండాలో కొన్ని అభ్యంతరకరమైన అంశాలు ఉన్నప్పటికీ సభ్యులు కనీసం వాటిపై సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి వివరణ కోరకుండానే ఏకపక్షంగా ఆమోదించేయడం సమావేశానికి హాజరైన మిగిలిన అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో 117 అంశాలతో తయారుచేసిన ఎజెండాపై సభ్యులు చర్చించారు. జీవీఎంసీ పరిధిలో ఇప్పటికే ఏడు వేల మందికిపైగా పారిశుధ్య కార్మికులు ఉన్నారు. అయితే కొన్ని వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ కోసమంటూ అదనంగా తాత్కాలిక సిబ్బందిని నియమించినందున వారికి వేతనాలు చెల్లించాలనే అంశం ఎజెండాలో చేర్చగా సభ్యులు కనీసం ప్రశ్నించకుండానే ఆమోదిస్తున్నట్టు చేతులు ఎత్తేశారు. అలాగే ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేందుకు 630 క్లాప్ వాహనాలు ఉన్నాయి. అయినప్పటికీ కొన్ని వార్డుల్లో చెత్త తరలింపునకు అదనంగా వాహనాలను అద్దె

... మిగతా 6వ పేజీలో



మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన సమావేశమైన స్టాండింగ్ కమిటీ

# మధ్యాహ్న భోజన పథకం రేట్లు పెంపు

- ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ ఒక్కొక్కరికి రూ.6.19
- ఆరు నుంచి పదో తరగతి వరకు రూ.9.28 పైసలు

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):

విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనానికి ప్రస్తుతం చెల్లిస్తున్న మొత్తాన్ని ప్రభుత్వం పెంచింది. ఈ రేట్లు డిసెంబరు ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. ఏటా ఏప్రిల్‌లో రేట్లు పెంచుతారు. ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది రేట్ల పెంపు ఆలస్యమైంది. ఇప్పటివరకూ ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.5.88 (రూ.5.45 ప్లస్ రూ.0.43పై) ఇస్తుండగా... దానిని రూ.6.19 పైసలకు పెంచారు. అంటే రోజుకు రూ.0.31 పైసలు పెంచారు. అలాగే ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు ఇప్పటివరకూ రూ.8.57 (రూ.8.17 పైసలు ప్లస్ రూ.0.40 పైసలు) ఇస్తుండగా... డిసెంబరు ఒకటో తేదీ నుంచి రూ.9.28కు పెంచారు. అంటే రూ.0.71 పైసలు.



విశాఖపట్నం జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 72,918 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 90 శాతం మంది పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. జిల్లాలో 582 పాఠశాలలు ఉండగా నగరంతోపాటు ఆనందపురం, భీమిలి మండలాల్లోని 315 పాఠశాలల్లో విద్యార్థులకు అక్షయ పాత్ర ద్వారా భోజనం సరఫరా అవుతుండగా, మిగిలిన పాఠశాలల్లో స్థానికంగా వంట ఏజెన్సీలు ఉన్నాయి. మధ్యాహ్న భోజనం కోసం ప్రభుత్వం బియ్యం, గుడ్లు, చిక్కీలు అందజేస్తుంది. భోజనం తయారీకి అవసరమైన ఖర్చుల్లో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరిస్తున్నాయి.

జిల్లాలో 72,918 మంది విద్యార్థులకు నెలకు

... మిగతా 6వ పేజీలో

# మహిళా ప్రయాణికులపై దాడి

ద్రావకం పోసి పరారైన గుర్తు తెలియని వ్యక్తి

- యాసిడ్ దాడిగా సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో కలకలం
- కళ్లు మండుతున్నాయని బాధితులు చెప్పడంతో ఆస్పత్రికి తరలింపు
- యాసిడ్ కాదని పోలీసుల నిర్ధారణ



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కంచరపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):

ఆర్టీసీ బస్సులో ముగ్గురు మహిళలపై ఓ వ్యక్తి గుర్తుతెలియని ద్రావకం పోసి పారిపోయాడు. అయితే అది యాసిడ్ దాడిగా సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే...శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో ఆర్టీసీ బస్సు

... మిగతా 6వ పేజీలో

## జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీగా సత్తిబాబు

- వుడా ఎస్టేట్ అధికారిణిగా శాంతి

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం నియమించింది. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న సీహెచ్ సత్తిబాబును జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించింది. అలాగే వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ అధికారిగా బొడ్డేపల్లి శాంతి, భూసేకరణ ఎస్డీసీగా బి.దయానిధి, ఏపీఐఐసీ భూసేకరణ ఎస్డీసీగా పి.కృష్ణమూర్తి, సివిల్ డిఫెన్స్ ఎస్డీసీగా హెచ్‌వీ జయరాం, హెచ్‌పీసీఎల్ భూసేకరణ ఎస్డీసీగా ననపల సుధాసాగర్, 16వ నంబర్ జాతీయ రహదారుల విభాగం ఎస్డీసీగా జె.సీతారామ్, కేజీహెచ్ పాలనాధికారిగా బీవీ రమణ, మైనారిటీ కార్పొరేషన్ ఈడీగా షామున్నీసా బేగమ్ నియమితులయ్యారు. అయితే వీఎంఆర్‌డీఏలో కీలకమైన సెక్రటరీ పోస్టును ఇంకా భర్తీ చేయలేదు.ఈ పోస్టుకు పలువురు పోటీ పడుతున్నారు.

# నేడు అనంత పద్మనాభుని దీపోత్సవం

సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభం

- 1,286 మెట్లకు ఇరు వైపులా దీపాలు వెలిగించనున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం





అనంతుని గిరి మెట్ల మార్గం. (ఇన్‌సెట్) పద్మనాభంలోని గిరిపై వెలసిన అనంతుడు

పద్మనాభం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):

పద్మనాభంలోని అనంత పద్మనాభుని దీపోత్సవం శనివారం నిర్వహించనున్నారు. కొండ దిగువన తొలి పావంచా వద్ద సాయంత్రం ఐదు గంటలకు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఏటా కార్తీక బహుళ అమావాస్య రోజున దీపోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. పద్మనాభుని కొండపై వరకు ఉన్న 1,286 మెట్లకు ఇరువైపులా ప్రమిదలలో నూనె వేసి ఒక్కసారిగా దీపాలను వెలిగించడం ప్రత్యేకత. ఉత్సవంలో భాగంగా భక్తులు వేకువ జాము నుంచి గిరి ప్రథమ పావంచా వద్ద పూజలు చేసి, మెట్లకు పసుపు, కుంకుమ బొట్లు పెడుతూ గిరిని అధిరోహించి, అనంతపద్మనాభుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం దీపాలను వెలిగించడానికి మెట్లను రిజర్వు చేసుకుంటారు. సాయంత్రం నాలుగు గంటలకు కుంతీ మాధవస్వామి ఆలయంలో ఉన్న ఉభయ దేవేరులతో కూడిన అనంతుడుని వేద పండితులు

... మిగతా 6వ పేజీలో

## మూలకుద్దు గోస్తనీ నదిపై కాజ్‌వే

భీమునిపట్నం (రూరల్), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలకుద్దు గ్రామం వద్ద గోస్తనీ నదిపై కాజ్‌వే నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. గ్రామాన్ని ఆనుకుని ఉన్న గోస్తనీ నది దాటి ఆవతల ఉన్న ప్రజలు తగరపువలస వెళ్లి అవంతి కళాశాల పక్కనున్న రోడ్డు మీదుగా ప్రయాణించాల్సి ఉంది. కాజ్‌వే నిర్మించినట్లయితే భీమిలి నుంచి నేరుగా చిప్పాడ గ్రామానికి చేరుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం చిట్టివలస జూట్‌మిల్లు వెనుక నుంచి మూలకుద్దు వరకు రహదారి నిర్మిస్తున్నారు. ఈ రహదారిని ఆనుకుని ఉన్న నదిపై కాజ్‌వే నిర్మించినట్టు అయితే భోగాపురం విమానాశ్రయానికి చిప్పాడ రోడ్డులో అన్నవరం మీదుగా జాతీయ రహదారిని చేరుకోవచ్చు. ఈమేరకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

## గీతంలో బయోమెడికల్ పరిశోధన కేంద్రం

సాగర్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ ఫార్మశీలో ఏర్పాటు చేసిన బయో మెడికల్ పరిశోధన కేంద్రాన్ని గీతం ఛాన్సలర్ ప్రొఫెసర్ వీరేంద్రసింగ్ చౌహాన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్త రణ్‌దాస్, స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజా పాల్గొన్నారు.

## శివ పార్వతుల కల్యాణం


కల్యాణం చేస్తున్న అర్చకుడు

కొమ్మాది, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మాస శివరాత్రి సందర్భంగా స్వతంత్రనగర్‌లో ఉన్న లింగేశ్వరస్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అన్నాభిషేకం జరిపి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆకాశ దీపారాధన, రుద్రాభిషేకం, రుద్ర హోమం జరిపారు. కార్యక్రమంలో 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత,టీడీపీ సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావు, నమ్మి రమణ, కొర్రాయి సురేశ్, పోతిన అనురాధ, పొలిమాటి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## నండూరికి నివాళి

తగరపువలస,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస సీఐటీయూ కార్యాలయంలో కార్మిక నాయకుడు నండూరి ప్రసాదరావు వర్ధంతి సభ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీటూ నాయకుడు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్. అప్పలనాయుడు, ఆర్. నరసింగరావు, నీలాతి రాము, పల్లా పెంటరాజు, జోగ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు పరిశీలన

ఆనందపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వేములవలస సచివాలయం వెనుక జాతీయ రహదారికి ఆనుకుని ఉపాధి నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఎంపీడీఓ జానకి శుక్రవారం పరిశీలించారు. ఆమెతో పాటు పంచాయతీ విస్తర ణాధికారి సత్యనారాయణ, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావు, కార్యదర్శి రామకృష్ణ ఉన్నారు.

## నేడు అనంత పద్మనాభుని దీపోత్సవం

... 5వ పేజీ తరువాయి

మంత్రోచ్చారణలతో, పల్లకిపై ఊరేగింపుగా ప్రథమ పావంచా వద్దకు తీసుకువచ్చి ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై అధిష్ఠింపజేస్తారు. అనంతరం విశేష అర్చనలు చేసి భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు కొండపై జేగంట కొట్టగానే అప్పటికే మెట్లపై ఏర్పాటుచేసిన నూనె దీపాలను భక్తులు వెలిగిస్తారు. దీపకాంతులతో అనంతుని గిరి దేదీప్యమానంగా వెలుగొందడంతో భక్తులు ఆధ్యాత్మిక పారవశ్యంతో మునిగి తేలుతారు.

### ఉత్సవ నేపథ్యం

పద్మనాభంలోని గిరి ప్రాంతంలో 1939లో అప్పటి విజయనగరం పాలకుడు పూసపాటి అలక్‌నారాయణ గజపతి ఆనతి మేరకు ద్రాక్షారామం నుంచి వచ్చిన చేకూరి సత్యనారాయణరాజు, బుల్లి సత్యనారాయణరాజు ఆశ్రమం ఏర్పాటు చేసుకున్నారు. ద్రాక్షారామం హోమ గుండంలో లభ్యమైన త్రిపురసుందరీదేవి విగ్రహాన్ని తీసుకువచ్చి యజ్ఞ, యాగాదులు నిర్వహించేవారు. ఆఖరిరోజున అనంతుని కొండ మెట్ల పంక్తికి దీపోత్సవాన్ని నిర్వహించేవారు. కొంతకాలం తరువాత ఉత్సవం నిలిచిపోయింది. మళ్లీ 1987లో అప్పటి ఆలయ అర్చకులు రాకుధాటి కృష్ణమాచార్యులు (పెదబాబు) సూచనల మేరకు పునఃప్రారంభించారు.

### సర్వం సిద్ధం

ఉత్సవానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరానుండడంతో 600 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం ఒంటిగంట తరువాత భారీ వాహనాలను దారి మళ్లిస్తారు. చిన్నాపురం జంక్షన్, నీలకుండీలు జంక్షన్, మహారాజుపేట జంక్షన్ మీదుగా భక్తులను అనుమతిస్తారు. చిన్నాపురం జంక్షన్ నుంచి వచ్చే కార్లు, బైక్‌లకు జెడ్పీ అతిథిగృహం, మామిడి తోట, అర్చకునిపాలెం వద్ద, మహారాజపేట నుంచి వచ్చే వారికి తహసీల్దారు కార్యాలయం, పౌర సరఫరాల శాఖ గిడ్డంగి, స్ప్రింగ్ ఫీల్డు పాఠశాల వద్ద, నీలకుండీలు నుంచి వచ్చే వారికి పద్మనాభం వంతెన, గరానా సత్యనారాయణ ఖాళీస్థలం, చెరకు కాటా వద్ద పార్కింగ్‌కు స్థలాలు ఏర్పాటుచేశారు.


మద్ది గ్రామంలో పొలాల్లో ఉన్న వరి కుప్పలు, పనలు


భీమిలిలో ఎగిసిపడుతున్న సముద్ర కెరటాలు

# అన్నదాతల్లో తుఫాన్ గుబులు

**వాతావరణ శాఖాధికారుల ప్రకటనతో ఆందోళన**

పద్మనాభం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు తుఫాన్ గుబులు పట్టుకుంది. నైరుతి బంగాళాఖాతంలో గల తీవ్ర వాయుగుండం శుక్రవారం తుఫాన్‌గా మారింది. ఈమేరకు ఉదయం నుంచీ ఆకాశం మేఘావృతమై, ఈదురుగాలులు వీస్తున్నాయి. రాత్రి నుంచి చిరు జల్లులు పడుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికి అంది వచ్చిన పంట ఎక్కడ పాడవుతుందోనని భయపడుతున్నారు. ఉత్తరాంధ్రలో శుక్ర, శనివారం వర్షాలు కురుస్తాయి తప్ప భారీ వర్షాలు పడే అవకాశం లేదని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నా.. ఎప్పుడు ఎలా ఉంటుందోనని రైతులు ఆలోచనలో పడ్డారు. ఇప్పటికే అనంతవరం, పెంట, కొవ్వాడ, గంధవరం, బాందేవుపురం, తునిపోలం గ్రామాల్లో పలుచోట్ల వరి పైర్లు గాలికి నేలకొరిగాయి, కొన్నిచోట్ల పనలు పొలాల్లోనే కుప్పలుగా వేశారు. మరికొంతమంది కోతలకు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే నష్టం తప్పదని ఆందోళన చెందుతున్నారు.

### భీమిలి తీరంలో అలజడి

భీమునిపట్నం : తీరంలో కెరటాలు పెద్ద ఎత్తున ఎగిసిపడుతున్నాయి. కెరటాల ఉధృతిగా ఉండడం, వాతావరణం చల్లబడడంతో సందర్శకుల తాకిడి తగ్గింది. రోజూ సందర్శకులతో కళకళలాడిన తీరం బోసిపోయింది.

# విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం : ఎమ్మెల్యే గంటా

సాగర్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి, పట్టుదలతో ప్రయత్నించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రాడిసన్ బ్లూ హోటల్‌లో సన్ కలర్స్ 2024 ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నచ్చిన రంగంలో రాణించాలంటే ఏకాగ్రత, పట్టుదల ఎంతో ముఖ్యమన్నారు. పర్యాటక రంగంలో విశేష అవ కాశాలు, ఉపాధి లభిస్తుందని చెప్పారు. గౌరవ అతిథి కంకటాల మల్లికార్జునరావు మాట్లాడుతూ సన్ అంటే ఒక బ్రాండ్ అని, ఎందరో విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలబెట్టిన ఘనత విద్యా సంస్థకు దక్కుతుందన్నారు. సన్ సీఎండీ శ్రీకాంత్ జాస్తి మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం స్థాపించిన సన్ ప్రస్థానం రెండు శతాబ్దాలుగా కొనసాగడం ఆనందంగా ఉందని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశాజాస్తి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యతో పాటు క్రీడా, సాంస్కృతి, పురాతన సంప్రదాయాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. అలాగే నిర్వాహకులు ఎమ్మెల్యే గంటాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గంటా శారద, రవితేజ, నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

## జేఎన్ఏఆర్‌డీడీసీతో గీతం ఎంఓయూ

సాగర్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ అనుబంధ విభాగం జవహర్‌లాల్ నెహ్రూ అల్యూమినియం రీసెర్చి డెవలప్‌మెంట్ అండ్ డిజైన్ సెంటర్ (జేఎన్ఆర్‌డీడీసీ)తో గీతం యూనివర్సిటీ శుక్రవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గీతం ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, జేఎన్ఆర్‌డీడీసీ గీతం డైరెక్టర్ డాక్టర్ అనుపమ్ అగ్నిహోత్రి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డీన్ డాక్టర్ ఏకే ప్రసాదరావు, డైరెక్టర్ ప్రొఫెసర్ కె. నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

భీమునిపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పక్కి నాగేశ్వరరావును స్థానిక సీబీఎం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ మాట్లాడుతూ సీబీఎం హైస్కూల్ పూర్వ విద్యార్థి, చిట్టివలస హైస్కూల్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడం మండలానికి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, సీబీఎం హైస్కూల్ కరస్పాండెంట్ కుమారి, ఎంఈవో జయప్రద, పట్టణ ప్రముఖులు షైలపల్లి షణ్ముఖరావు, భారతి, పీఎస్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

## 7 నుంచి గీతామృత ప్రవచనాలు

భీమునిపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్ మంగమారిపేట వారిజ ఆశ్రమ స్వామీజీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో వచ్చేనెల 7 నుంచి 11 వరకూ గీతామృత ప్రవచనాలు జరగనున్నట్టు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వారు ప్రకటన విడుదల చేశారు. సీతమ్మధారలో ఎంవీఈకేకే వర్మ కాంప్లెక్స్ ఆవరణలో ఈ ప్రవచనాలను పరమహంస పరివ్రాజకాచార్యులు చిన్న జీయరుస్వామి అందిస్తారన్నారు. వివరాలకు 9989819666 సెల్ నంబరును సంప్రతించాలని వారు సూచించారు.

## పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

పద్మనాభం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీవో ఎం. విజయ్‌కుమార్ తెలిపారు. 16 సచివాలయాల పరిధిలో 7805 మంది పింఛన్‌దారులకు రూ. 3.18 కోట్లు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు.

# మహిళా ప్రయాణికులపై దాడి

... 5వ పేజీ తరువాయి

విశాఖ నుంచి గిడిజాల బయలుదేరింది. కంచరపాలెం ఐటీఐ జంక్షన్ దగ్గరకు వచ్చేసరికి ఓ వ్యక్తి యాసిడ్‌తో దాడి చేశాడంటూ ముగ్గురు మహిళా ప్రయాణికులు గగ్గోలు పెట్టడంతో డ్రైవర్ బస్సును నిలిపి, వారిని స్థానికుల సహాయంతో సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కంచరపాలెం సీఐ చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని జల్లిన ద్రవం యాసిడా? మరేదైనా? అని పరీక్షించారు. బాధితులు కళ్లు మంట పెడుతున్నట్టు చెప్పడంతో మెరుగైన వైద్యం కోసం మరో ఆస్పత్రికి పంపించారు. దాడికి పాల్పడిన వ్యక్తి వెంటనే అక్కడ నుంచి పరారవ్వడంతో పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. ఈ హడావిడి కారణంగా రోడ్డు మధ్యలో బస్సు ఆగిపోవడంతో గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

# అండర్ స్టాండింగే!

... 5వ పేజీ తరువాయి

ప్రాతిపదికన ఏర్పాటు చేసుకున్నామని, కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించాలని ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించేశారు. అలాగే చెట్ల వ్యర్థాల తరలింపునకు ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటుచేయడం వంటి అంశాలపై కూడా సభ్యులు కనీసం ప్రశ్నించలేదు. ఆయా కాంట్రాక్టర్లతో కొంతమంది సభ్యులు ముందుగానే అవగాహన కుదుర్చుకోవడం వల్లే సమావేశం ఆ విధంగా జరిగిందని అధికారులు అభిప్రాయపడ్డారు. జోన్-8లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెంకటరావు వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా, కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం తీసుకుందామంటూ సభ్యులు వాయిదా కోరారు. అలాగే నిరాశ్రయుల వసతి గృహాల్లో సిబ్బంది సేవలు పొడిగింపు, ఆశ్రయం పొందేవారికి భోజన సదుపాయాలకు సంబంధించిన అంశాలను కూడా సభ్యులు స్వయంగా పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పి ఆయా అంశాలను వాయిదా వేయాలని మేయర్‌ను కోరారు. అలాగే 76వ వార్డులో రూ.49.74 లక్షలు వ్యయంతో డ్రెయిన్ నిర్మాణానికి అనుమతిచ్చే అంశంపై సభ్యులు వివరణ కోరగా, సదరు అధికారి అందుబాటులో లేకపోవడంతో అంశాన్ని వాయిదా వేశారు.

## వైభవంగా అమ్మవార్ల తిరువీధి

సింహాచలం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో అమ్మవార్ల తిరువీధి ఉత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం సువర్ణ, సింహవల్లీ తాయార్ అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి, ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల మంత్ర పారాయణలు నడుమ బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. మార్గంలో అష్టదిక్కులకు భక్తులు పూజలు చేసి నీరాజనాలిచ్చారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన

తగరపువలస, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది సీజనల్ వ్యాధులపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. సి. పూజ విద్యార్థులకు మెడికల్ కిట్లు అందజేసి, పలు ఆరోగ్య సూత్రాలను తెలియజేశారు. ఫోలిక్ యాసిడ్ మాత్రను ప్రతి విద్యార్థి రెగ్యులర్‌గా వేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పలరాజు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## 200 మందికి వైద్య పరీక్షలు

ఆనందపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాల్లోభాగంగా వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెంలో టీడీపీ నాయకులు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వ హించారు. ఈ శిబిరాన్ని ఉప సర్పంచ్ కంచరాపు శ్రీనివాసరావు ప్రారంభించారు. యూనిక్ ఆస్పత్రి వైద్యులు 200 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచరాపు శ్రీనివాసరావు, సాడి రామకృష్ణ, నరేశ్‌రెడ్డి, దాసరి సుశీల, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి

మధురవాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పాత మధురవాడలో సీసీ రోడ్లు, కాలువలతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని 7వ వార్డు టీడీపీ సీనియర్ నాయకుడు పిళ్లా వెంకట్రావు, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, తదితరులు ఇంజనీరింగ్ ఈఈ శాంతిరాజును కోరారు. శుక్రవారం వారు పాత మధురవాడలో ఈఈతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు.

## 'కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం'

ఆనందపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ అన్నారు. తర్లువాడలో సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదులో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాట్రాజు అప్పారావు, గండ్రెడ్డి రమేశ్‌స్వామి, మజ్జి రమేశ్ నాయుడు, బంకు అప్పలరాజు, పిల్లా చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

**పద్మనాభం రూరల్ :** మద్ది గ్రామంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కాళ్ల నగేశ్ కుమార్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. గంటా రవితేజ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో పాల సొసైటీ మాజీ డైరెక్టర్లు బుగత ప్రకాశ్, కె.సన్యాసినాయుడు, కనకల ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

## 98వ వార్డులో రూ. 48.7 లక్షలతో అభివృద్ధి పనులు

సింహాచలం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డులో రూ. 48.7 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టడానికి జీవీఎంసీ స్థాయీ సంఘం అనుమతి ఇచ్చిందని కార్పొరేటర్ నరసింహం అన్నారు. మేయర్ హరి వెంకట కుమారి అధ్యక్షతన శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో స్థాయీ సంఘం సమావేశం జరిగింది. ఈమేరకు వార్డులో జరగనున్న అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ నిధులతో బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ ఫేజ్-2లో అంతర్భాగంగా తొలిపావంచా నుంచి పాత అడివివరం కూడలి వరకు రిటైనింగ్ వాల్, అప్రోచ్ రోడ్లు నిర్మించనున్నట్టు పివి చెప్పారు. తక్షణమే టెండర్లు పిలిచి, పనులను ప్రారంభించాలని అధికారులను కోరారు.


సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ నరసింహం

# గంజాయిపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

రోడ్డుపై వచ్చిపోయే వారిపై దాడులు చేస్తుండడంతో నగరవాసులు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. గత కొద్దిరోజులుగా నగరంలో పోలీసులకు భారీగా గంజాయి పట్టుబడుతోంది. ఈగల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు అందుబాటులోకి వస్తే నగరం మీదుగా గంజాయిని రవాణా చేస్తున్న స్మగ్లర్లు, వ్యాపారులతోపాటు గంజాయి వినియోగదారులకు చుక్కలు కనిపించడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# సంప్రదాయబద్ధంగా స్వాతి నక్షత్ర హవనం

సింహాచలం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో స్వాతి నక్షత్ర హవనం శుక్రవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. నృసింహస్వామి ఆవిర్భావాన్ని పురస్కరించుకుని ప్రతి నెలలో స్వాతి నక్షత్రం రోజున ఆర్జిత సేవగా హవనం చేయడం ఆనవాయితీ. ఈమేరకు వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. యజ్ఞ మూర్తిగా సుదర్శన పెరుమాళ్‌ను ప్రత్యేక వేదికపై అధిష్ఠింజేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్ర విధానంలో మండపారాధన, కలశారాధన, బింబారాధన చేసి, ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్నిప్రతిష్ఠాపన జరిపారు. పంచ సూక్తాలు, నారసింహ, సుదర్శన, మూల, మూర్తి మంత్రాలతో హవనాన్ని చేశారు. మహా పూర్ణాహుతి చేసిన తరువాత ప్రధాన కలశాన్ని అంతరాలయంలోని మూలవిరాట్ సన్నిధానంలో ఉంచి పూజలు చేసి, అందులోని పవిత్ర జలాలతో భక్తులను ప్రోక్షణ చేశారు.


స్వామివారి సన్నిధిలో ప్రధాన కలశంతో అర్చకులు


ఆలయంలో యుదుగిరి యతిరాజ రామానుజ జీయర్‌స్వామి

## అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని పలువురు ప్రముఖులు శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో తెలంగాణా, ఏపీ. ఒడిశా రాష్ట్రాల ఆదాయ పన్ను శాఖ డైరెక్టర్ జనరల్ ఆనంద్ రాజేశ్వర్ బైవార్, బుల్లి తెర నటుడు మానస్, బెంగళూరులోని యుదుగిరి పీఠాధిపతి యుదుగిరి యతిరాజ రామానుజ జీయర్‌స్వామి ఉన్నారు. వారికి ఏఈఓ రాంబాబు, పర్యవేక్షణాధికారులు త్రిమూర్తులు, ప్రసాద్ అధికారిక మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అర్చకులు అంతరాలయంలో పూజలు చేసి ఐటీ డీజీకి, స్వామీజీలకు శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా అధికారులు సత్కరించి, ప్రసాదాలు అందజేశారు.


కప్ప స్తంభం వద్ద ఆనంద్ రాజేశ్వర్ బైవార్

## అవయవ దానంపై అవగాహన ర్యాలీ


అవయవ దాన అవగాహన ర్యాలీలో పాల్గొన్న గంటా రవితేజ, తదితరులు

భీమునిపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : యువత అవయవ దానానికి ముందుకు రావాలని టీడీపీ నాయకుడు గంటా రవితేజ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని బెస్ట్ ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ పరులకు సాయం చేయాలన్న ఆలోచన, అభాగ్యులకు ఆసరా అందించాలన్న దృక్పథం మహోన్నతమైన దాతృత్వ గుణాలన్నారు. అభాగ్యులను అక్కున చేర్చుకుని సేవలందిస్తున్న బెస్ట్ ఫ్రెండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. అనంతరం జూనియర్ కళాశాల నుంచి గంట స్తంభం, మెయిన్ రోడ్, పాత బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనిల్ కాంప్లెక్స్ జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అవయవ దాతల సంఘం ఛైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి, సభ్యురాలు నర్రా సీతా మహాలక్ష్మి, కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, అవయవదాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్ బాబు, బెస్ట్ ఫ్రెండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లా సూర్య, వైస్ ఛైర్మన్ సంతోష్ రాజా, కార్యదర్శి అప్పలనాయుడు, డైట్ వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సత్యవతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి. రమణ, ఎంహెచ్ స్కూల్ హెచ్ఎం వెంకటరావు పాల్గొన్నారు.

# వసతి ఓకే... ఆహారమే!

... 5వ పేజీ తరువాయి

వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించారు. మెరుగైన తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు నిర్మించారు. ఇంకా డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచడం ద్వారా పరిశుభ్ర వాతావరణం నెలకొల్పారు.

### రూ.8.7 కోట్లతో పనులు

సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని 12 వసతి గృహాలకు రూ.4 కోట్లు, బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని 11 వసతి గృహాలకు రూ.4 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఒక వసతి గృహానికి రూ.70 లక్షలు వెచ్చించి మౌలిక వసతులతో పాటు ఆధునికీకరణ పనులు చేపట్టారు. దీంతో స్పష్టమైన మార్పు కనిపించింది. ఈ చర్యలతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### మెనూ అమల్లో ఇబ్బందులు

ప్రస్తుతం కొన్ని వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం అందడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను అమలుచేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనంలో విద్యార్థులకు అందించాల్సిన ఆహార పదార్థాలతో ప్రభుత్వం మెనూ విడుదల చేసింది. ఈ మేరకు ఆహారం అందడం లేదు. చిక్కీలు, అరటిపండ్లు, రాగిజావ కొన్ని వసతిగృహాల్లో ఇవ్వడం లేదు. కొన్నిచోట్ల వండిన ఆహారంలో నాణ్యత లేదు. దీంతో తినలేని పరిస్థితి ఎదురవుతోందని విద్యార్థులు వాపోతున్నారు.

- కంచరపాలెంలోని గిరిజన సంక్షేమ శాఖకు చెందిన వసతిగృహంలో శుక్రవారం ఉదయం వడ్డించిన పెసర పప్పు పొంగలి గట్టిగా ఉండడంతో చాలామంది విద్యార్థులు తినలేదు. రాత్రిపూట వడ్డించే ఆహారంలో నాణ్యత ఉండడం లేదని, కూరలు రుచిగా ఉండడం లేదని పలువురు పేర్కొన్నారు.
- సీతమ్మధారలోని విద్యార్థులకు శుక్రవారం ఉదయం పెట్టిన కిచిడీ పులిహోరను తలపించింది. ప్రతిరోజూ సాయంత్రం రాగి జావ, స్నాక్స్ ఇవ్వాల్సి ఉండగా అప్పుడప్పుడు ఇస్తున్నారని విద్యార్థులు తెలిపారు.

### ఒకే గదిలో పది మంది..

చాలా వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించినప్పటికీ ఇంకా కొన్నింటిలో వసతి సమస్య ఎదురవుతోంది. మర్రిపాలెం జ్యోతినగర్‌లో రెండంతస్తుల ప్రైవేటు భవనంలో బీసీ సంక్షేమ శాఖ వసతిగృహం నడుస్తోంది. ఇందులో 120 మంది విద్యార్థులు ఉంటున్నారు. చిన్న గదిలో పదిమంది చొప్పున సర్దుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. కేవలం ఆరు మరుగుదొడ్లు మాత్రమే ఉండడంతో జీవీఎంసీ పబ్లిక్ టాయ్‌లెట్స్ దిక్కవుతున్నాయని చెబుతున్నారు.

### చాలని చార్జీలతో ఇబ్బంది..

ప్రస్తుతం ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రోజుకు రూ.53 చొప్పున మెస్ చార్జీలు ఇస్తోంది. పెరిగిన ధరలతో భోజనం పెట్టడానికి రూ.100 ఖర్చవుతోందని, ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో మెనూ అమలుచేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉండడం కూడా ఇబ్బందిగా పరిణమించిందని, సరకులు తెచ్చుకోలేకపోతున్నామన్నారు.

# మధ్యాహ్న భోజన పథకం రేట్లు పెంపు

... 5వ పేజీ తరువాయి

సగటున రూ.90 లక్షలు ఖర్చు చేస్తున్నారు. వంట వండడం అంటే గ్యాస్ లేదా కట్టెలు, పప్పులు, కూరలు, ఇతర దినుసులు సంబంధిత వంట ఏజెన్సీ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం పెరిగిన రేట్లను పరిగణనలోకి తీసుకుని ప్రాథమిక విద్యార్థులకు రోజుకు రూ.8.00, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.12.00కు పెంచాలని వంట ఏజెన్సీలు డిమాండ్ చేస్తున్నాయి. తాజాగా పెంచిన రేట్లు కొంత వరకూ ఊరట కలిగించినా, పెరిగిన ధరలకు అనుగుణంగా లేవని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్షురాలు గూనూరు లక్ష్మి అన్నారు. వంట వండే కార్మికుల వేతనాలు కూడా పెంచి ఉంటే న్యాయం జరిగేదని అభిప్రాయపడ్డారు. కాగా మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి రేట్ల పెంపుపై ఎస్టీయూ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.పైడిరాజు హర్షం ప్రకటించారు.

### సెప్టెంబరు నుంచి అందని బిల్లులు

ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి వడ్డించే ఏజెన్సీలకు సెప్టెంబరు నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 9,10 తరగతి విద్యార్థులకు అక్టోబరు నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మధ్యాహ్న భోజన పథకం వండే సహాయకులకు సెప్టెంబరు వరకూ వేతనాలు మంజూరుచేశారు.

☛ సంక్షిప్తంగా..

## ప్రణవ్ గోపాల్‌ను కలిసిన టీఎన్‌టీయూసీ నాయకులు



ప్రణవ్ గోపాల్‌ను అభినందిస్తున్న టీఎన్‌టీయూసీ నేతలు

సిరిపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్‌ను టీఎన్‌టీయూసీ నాయకులు శుక్రవారం సిరిపురంలోని వీఎంఆర్డీఏ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ సిటీ కొమ్మాది నుంచి స్టీల్ ప్లాంట్ మెట్రో రైల్ ప్రతిపాదన ఉందని దానిని లంకెలపాలెం వరకు కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు విల్లా రామ్మోహన్‌కుమార్, కార్యదర్శి కొర్రయి నాగార్జున, అధికార ప్రతినిధి బలిరెడ్డి సత్యనారాయణ, పీలా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## పార్కులో పశువుల నియంత్రణకు చర్యలు




ఆవులను వ్యానులో తరలిస్తున్న సిబ్బంది

వెంకోజీపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కులో ఆవుల సంచారం, వాటి మూత్ర విసర్జనతో ఆటగాళ్లు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారంటూ గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపైజీవీఎంసీ వెటర్నరీ అధికారులు స్పందించారు. వెటర్నరీ డాక్టర్ కిషోర్ కుమార్ ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ రాము, వీఏవో సూర్యనారాయణ శుక్రవారం ఇక్కడి ఆవులను వేన్‌పై తరలించారు. ఆవులకు సంబంధించిన వ్యక్తులు వచ్చి జరిమానా కట్టి, తీసుకువెళ్లాలని, అంతేకాకుండా మరో సారి ఇటువంటి సమస్య పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని యజమానులకు హెచ్చరించారు.

# ప్రశాంతి..ఏమిటీ అధోగతి

» పార్కులో అధ్వానంగా పరిసరాలు » ఆసక్తి చూపని సందర్శకులు » నిర్వహణ గాలికొదిలేసిన అధికారులు




ప్రశాంతి పార్కు ప్రవేశ ద్వారం

ఎంవీపీ కాలనీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ నాలుగో సెక్టరులోని ప్రశాంతి పార్కులోకి వచ్చేవారికి ప్రశాంతత కరవవుతుంది. ఇటీవల పార్కు ప్రహరీ పాడైందని రూ. 16 లక్షలతో గోడ నిర్మాణం చేపట్టారు. కానీ లోపల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. పదిహేడో వార్డు పరిధిలోని ఈ పార్కును 2012లో ప్రారంభించారు. జీవీఎంసి ఆధ్వర్యంలో నిర్మించిన ఈ పార్కు నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. ప్రస్తుతం పిల్లల ఆట వస్తువులున్నా, పరిసరాలు బాగులేకపోవడంతో ఆడుకోవడానికి రావడం లేదు. ఇదే ఉద్యానవనంలో వాకింగ్ ట్రాక్ ఉంది. అలాగే వ్యాయామం చేసేందుకు సామగ్రిని కూడా ఇటీవలే ఏర్పాటుచేశారు. ఎన్ని ఉన్నా పరిసరాలు బాగులేకపోవడంతో ఈ పార్కులోకి రావడానికే సందర్శకులు భయపడుతున్నారు. ఎక్కడ ఏ పురుగు ఉంటుందో తెలియని పరిస్థితి. ఎప్పుడో పడిపోయిన చెట్ల కొమ్మలు పార్కులోనే రెండు చోట్ల గుట్టలుగా పోగేశారు. ఎవరైనా ఏ సిగిరెట్టో ఇటు పడేస్తే మొత్తం తగలబడిపోతుంది. ఇక హుద్‌హుద్‌లో పడిన చెట్లను తొలగించగా మోడులు అలానే ఉన్నాయి. పిల్లలు పొరపాటున పరుగులు తీస్తే పడి, తీవ్ర గాయాలు అయ్యే అవకాశం ఉంది. ఇక చెత్తా చెదారం వంటివి కూడా ఎక్కడ పడితే అక్కడ ఉంది. పారిశుధ్య సిబ్బంది కూడా దీనిని పట్టించుకున్న పాపాన పోలేదు. రెసిడెన్షియల్ అసోసియేషన్ పేరిట ఓ షెడ్డు ఉన్నా, నిర్వహణ లేదు. వృధా సామగ్రి కూడా ఆ పక్కనే ఉంది. దీనిని సమగ్రంగా నిర్వహిస్తే ఈ ప్రాంతీయులు ఓ మంచి ఉద్యానవనం అందుబాటులోకి వస్తుంది. అధికారులు ఈ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని ఇక్కడి వారు కోరుతున్నారు.



నిర్వహణ లేకపోవడంతో ఎక్కడ సామగ్రి అక్కడే..



గుట్టలా పడి ఉన్న ఎండుకొమ్మలు



పార్కు లోపల కొరవడిన శుభ్రత

## ఏయూలో ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ కోర్సు

» అవగాహన ఒప్పందం చేసుకున్న అవాంటెల్ లిమిటెడ్
» రెండో సంవత్సరంలో 25 వేల స్టయిపెండ్
» కోర్సు పూర్తి చేసిన వారికి రూ.9 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం



ఎంవోయూ చేసుకుంటున్న ఏయూ అధికారులు, అవాంటెల్ ప్రతినిధులు

వెంకోజీపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో నూతనంగా ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ కోర్సును ప్రారంభిస్తున్నారు. దీనికి సంబంధించి ఏయూతో అవెంటల్ లిమిటెడ్ అవగాహన ఒప్పందం చేసుకుంది. శుక్రవారం ఏయూ ఉపకులపతి జి.శశిభూషణరావు సమక్షంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, అవెంటల్ వైస్ ప్రెసిడెంట్ (టెక్నికల్) ఎన్.శ్రీనివాసరావు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు.

ఈ సందర్భంగా ఏయూ వీసీ మాట్లాడుతూ కోర్సులో 18 మందికి ప్రవేశాలు కల్పించనున్నట్టు తెలిపారు. మొదటి సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు రెండవ సంవత్సరంలో రూ.25 వేలు స్టైపెండ్ సైతం అందించనున్నట్టు చెప్పారు. అనంతరం విద్యార్థులకు రూ.9 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగ అవకాశాన్ని సైతం అవెంటల్ సంస్థ కల్పిస్తుందన్నారు. ఏయూలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి బీటెక్-వీఎల్ఎస్ఐ కోర్సును ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. దీనికి కేంద్ర ప్రభుత్వ ఐటీ శాఖ సహకారం అందిస్తుందన్నారు. పరిశ్రమలతో అనుసంధానం చేస్తూ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా నూతన కోర్సులను రూపకల్పన చేయనున్నట్టు చెప్పారు. అవంటెల్ లిమిటెడ్ అడ్వైజర్ డాక్టర్ నాగరాజన్ మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ అభ్యసనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అంతర్గతంగా ప్రేరణ పొందడం ఎంతో అవసరమన్నారు. టెక్నాలజీ వేగంగా మార్పునకు గురవుతోందని, ఎప్పటికప్పుడు తమ జ్ఞానాన్ని మెరుగుపరచుకోవడం ఎంతో అవసరమని చెప్పారు. సంస్థ ఉపాధ్యక్షులు (టెక్నికల్) ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏయూ చూపిస్తున్న చొరవ, సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజరు వేణుగోపాల్ అట్లూరి, డిప్యూటీ జనరల్ మేనేజరు జి.భాస్కర్, జనరల్ మేనేజరు(హెచ్‌ఆర్) శ్రీధర్ శర్మ ఈసీఈ విభాగాచార్యులు ఆచార్య పి.రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పార్కులో చెత్త తొలగింపు




పార్కు శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

వెంకోజీపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు హెచ్‌బీ కాలనీలో గల అబ్దుల్ కలాం పార్కులో జీవీఎంసీ పారిశుద్య సిబ్బంది శుభ్రం చేశారు. ఇటీవల స్థానికులు ఈ పార్కులో వేడుక నిర్వహించిన సమయంలో వ్యర్థాలను విడిచి పెట్టారని, దీంతో పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. ఈ విషయాన్ని గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన జీవీఎంసీ అధికారులు వెంటనే పార్కులో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు మాట్లాడుతూ పార్కులో వేడుకలు నిర్వహిస్తే సహించేది లేదని, పార్కును అశుభ్రం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుభ్రం వేస్త్రి నమ్మి చిన్నరాజు పాల్గొన్నారు.

## ఏఎస్ఎం వైజాగ్ ఛాప్టర్ ప్రారంభం



వైజాగ్ ఛాప్టర్‌ను ప్రారంభిస్తున్న ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్, మాజీ ప్రెసిడెంట్

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ టెక్నాలజీ, మెటీరియల్ సైన్స్ రంగాల అభివృద్ధి కోసం అమెరికన్ సైన్స్ సొసైటీ ఫర్ మెటల్స్ (ఏఎస్ఎం) వైజాగ్ చాప్టర్‌ను ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్)లో శుక్రవారం ఏఎస్ఎం ఇంటర్నేషనల్ మాజీ ప్రెసిడెంట్, ప్రదీప్ మెటల్స్ ఛైర్మన్ ప్రదీప్ గోయల్, ఏఎస్ఎం ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ నవీన్ మంజూరన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఎస్ఎం వైజాగ్ ఛాప్టర్ స్థాపన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా మెటలార్జీ కమ్యూనిటీని బలోపేతం చేసేందుకు ముందడగు అని, మెటీరియల్ సైన్స్‌ను అభివృద్ధి చేయటానికి సహకార వేదికను ప్రోత్సాహించటం ద్వారా తయారీదారులు,వ్యాపారులు, వినియోగదారులు, విద్యార్థులకు విలువైన అవకాశాలను సృష్టిస్తుందన్నారు. ఏఎస్ఎం వైజాగ్ ఛాప్టర్ ఇండస్ట్రీ, హెల్త్ కేర్ ఇన్నోవేషన్‌ల మధ్య కీలకమైన వారధిగా ఉంటుందన్నారు. వైద్య పరికరాలు, డయాగ్నోస్టిక్స్ కోసం అత్యాధునిక మెటీరియల్ సొల్యూషన్‌లనుఅభివృద్ధి చేయటానికి కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంటీజెడ్ ఎండీ డాక్టర్ జితేంద్రశర్మ పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు కృష్ణా కళాశాల విద్యార్థి



స్రవంతిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు, అధ్యాపకులు

మద్దిలపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నెహ్రూ యువకేంద్రం నిర్వహిస్తున్న జిల్లాస్థాయి యువ ఉత్సవ్-24లో డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న స్రవంతి పెయింటింగ్ విభాగంలో ప్రథమ బహుమతి గెలుచుకుంది. తద్వారా రాష్ట్రస్థాయి యువ ఉత్సవ్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు స్రవంతిని అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు పోల ఉమామహేశ్వరరావు, జీవీ ప్రతాప్, ఎం.శ్రీనివాసప్రసాద్ స్రవంతిని అభినందించారు.

## స్వదేశీ పరిజ్ఞానంతో లిథియం బ్యాటరీలు తయారుకావాలి

» ఆ దిశగా పరిశోధనలు జరగాలి
» ఏఆర్‌సీఐ మాజీ డైరెక్టర్ నరసింగరావు



నరసింగరావును సత్కరిస్తున్న దృశ్యం

సాగర్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వాహనాల కోసం దీర్ఘకాలం మన్నే లిథియం అయాన్ బ్యాటరీలు అవసరమని, దిగుమతులపై ఆధారపడకుండా స్వదేశీ పరిజ్ఞానంతో వాటిని తయారుచేయాల్సిన అవసరం ఉందని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చి సెంటర్ ఫర్ ఫౌండర్ మెటలర్జీ అండ్ న్యూమెటీరియల్స్ (ఏఆర్‌సీఐ) మాజీ డైరెక్టర్, ఐఐటీ హైదరాబాద్ రీసెర్చి సలహాదారు డాక్టర్ టాటా నరసింగరావు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయనశాస్త్ర విభాగంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 2030 నాటికి దేశంలో 30 శాతం విద్యుత్ వాహనాలు ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఇందు కోసం విద్యుత్‌ను అధికంగా నిల్వ చేసుకునే సామర్థ్యం గల లిథియం అయాన్ బ్యాటరీలు అవసరమన్నారు. దేశంలో ఈ బ్యాటరీల తయారీ పరిజ్ఞానం లేకపోవడంతో దిగుమతులపై ఆధారపడుతున్నామన్నారు. టెస్లా కంపెనీ ఎన్ఎంసీ బ్యాటరీలు రూపొందించిందని, కానీ ఇక్కడి వాతావరణ పరిస్థితులకు అవి సరిపోవని నిర్ధారించారన్నారు. లిథియం అయాన్ బ్యాటరీలలో ఉపయోగించే పదార్థం ఖరీదైనది కావడంతో చైనా తదితర దేశాలు ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాయన్నారు. మన వాతావరణ పరిస్థితులకు తగిన విధంగా ఎల్ఎఫ్‌పీ బ్యాటరీ పరిజ్ఞానాన్ని హైదరాబాద్‌లోని ఏఆర్‌సీఐలో రూపొందించి పరిశ్రమలకు అందించిందన్నారు. త్వరలో ఇక్కడ తయారయ్యే విద్యుత్ వాహనాల్లో ఈ బ్యాటరీలనే వినియోగిస్తారన్నారు. కార్యక్రమంలో సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఏఎస్ కృష్ణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, ప్రొఫెసర్ ఎన్‌వీఎస్ వేణుగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## 30 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు



నియామక పత్రాలను అందజేసిన మేయర్

వెంకోజీపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో 30 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శుక్రవారం తన కార్యాలయంలో అందించారు. జీవీఎంసీలో విధులు నిర్వహిస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు 30 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులను అందించడం జరిగిందని మేయర్ ఈ సందర్భంగా తెలిపారు. ఇందులో ఒక వర్క్ ఇన్‌స్పెక్టర్, పది మంది ఆఫీస్ సబార్డినేట్లు, ముగ్గురు పీహెచ్ మేస్త్రిలు, నలుగురు పీహెచ్ వర్కర్లు, 12 మంది మజ్దూర్ మొత్తంగా 30 మందిని జీవీఎంసీలో నియమిస్తూ ఉత్తర్వులను అందించామని ఆమె అన్నారు. ఈ 30 మంది సంబంధిత విభాగాల్లో వెంటనే విధుల్లో చేరి ఉద్యోగాలను చిత్తశుద్ధితో నిర్వహించి జీవీఎంసీ ద్వారా ప్రజలకు సేవలు అందించాలని మేయర్ సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

## నగరాభివృద్ధికి మరింత కృషిచేయాలి

వెంకోజీపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక కూడలిలో ట్రాఫిక్ సమస్య నివారించేందుకు ఫ్లై ఓవర్ నిర్మించాలని, నగరంలో పలు ప్రాజెక్టులు తీసుకొచ్చి నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దే విధంగా పని చేయాలని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్‌ను విశాఖ తూర్పు టీడీపీ నాయకులు అక్కరమాని వెంకట్రావు కోరారు. శుక్రవారం ప్రణవ్‌గోపాల్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో వెంకటరావు మర్యాదపూర్వకంగా కలిసి విశాఖ అభివృద్ధి గురించి మాట్లాడారు.

## లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పాతగాజువాక జంక్షన్ వద్ద ప్రమాదం

గాజువాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పాత గాజువాక జంక్షన్ సమీపంలో శుక్రవారం రాత్రి 10.50 గంటల సమయంలో లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు. పాతగాజువాక నుంచి కూర్మన్నపాలెం మార్గంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని అదే మార్గంలో వస్తున్న లారీ వెనక నుంచి బలంగా ఢీకొంది. ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యకిపై నుంచి లారీ వెళ్లిపోవటంతో శరీరం మొత్తం నుజ్జయిపోయింది. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ద్విచక్రవాహనం నెంబరు ఆధారంగా పరిశీలిస్తే శ్రీనగర్ ప్రాంతానికి చెందిన అప్పలనాయుడు అని చూపిస్తోందని, మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## సినిమా గైడ్

- **మెకానిక్ రాఖీ:** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **దేవకీనందన వాసుదేవ:** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **జీబ్రా :** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **కంగువా :** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **లక్కీ భాస్కర్:** వెంకటేశ్వర
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 48, టమాటా 46, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 34, బెండకాయలు 26, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 38, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 32, క్యారెట్ 50 దొండకాయలు 32, బంగాళ దుంపలు 34, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 50, కీర దోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడ దుంపలు 32, కంద 58, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

**కోడిగుడ్లు (నెక్)** (వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 585 |
| విజయనగరం | 589 |
| శ్రీకాకుళం | 589 |

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | |
|---|---|
| రైతు ధర | 105 |
| ఫారం ధర | 125 |
| విత్ స్కిన్ | 220 |
| స్కిన్‌లెస్ | 230 |

## మద్యం మత్తులో ఆత్మహత్యాయత్నం

» పైగా తనను చంపేందుకు యత్నించాడు అంటూ మరో వ్యక్తిపై ఆరోపణ



గొంతుపై బ్లేడుతో గాయాలు చేసుకున్న అప్పారావు

ఆరిలోవ, నవంబరు 29 : (ఆంధ్రజ్యోతి) : అధికంగా అప్పులు చేసిన వ్యక్తి మద్యం మత్తులో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. అంతేకాకుండా తనను వేరే వ్యక్తి చంపేందుకు యత్నించాడంటూ నమ్మించే యత్నం చేశాడు. అయితే పోలీసుల విచారణలో వాస్తవం వెల్లడైంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

తోటగరువుకు సమీపంలో గల గాంధీనగర్‌కు చెందిన గవిరెడ్డి అప్పారావు (59) ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బుధవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో తోటగరువు వంతెనపై కూర్చొని బ్లేడుతో గొంతు గోసుకున్నాడు. స్థానికులు గుర్తించి వెంటనే అతడిని విమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ఆరిలోవ పోలీసులు విచారించగా.. తనకు గుడ్లవానిపాలేనికి చెందిన గరికిన నూకరాజుతో పాత గొడవలు ఉన్నాయని, అతడే తనను చంపడానికి యత్నించాడంటూ చెప్పాడు. దర్యాప్తులో భాగంగా ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ కృష్ణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, అక్కడ బ్లేడు దొరికింది. అనుమానం వచ్చిన పోలీసులు.. అప్పారావును కాస్త గట్టిగా విచారించగా, తనను ఎవరూ హత్య చేసేందుకు యత్నించలేదని, తానే బ్లేడుతో కోసుకున్నానంటూ అంగీకరించాడు. అప్పులు ఎక్కువగా ఉండడంతో మద్యం మత్తులో ఆ విధంగా చేసుకున్నట్టు చెప్పాడు.

కాగా ప్రస్తుతం అప్పారావుకు ఎలాంటి ప్రమాదం లేదని సీఐ చెప్పారు. కాగా, అప్పారావుపై కేసు నమోదు చేశామని, ఎస్ఐ కృష కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## మార్గశిర మాసోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవో శోభారాణి వెల్లడి



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఈవో శోభారాణి, ఇతర అధికారులు

జగదాంబ కూడలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్యనిర్వహణాధికారిణి కె.శోభారాణి తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. డిసెంబరు 2 నుంచి 30 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. 2న ఉదయం 8 గంటలకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తొలిపూజతో ప్రారంభిస్తారని తెలిపారు. టౌన్ కొత్తరోడ్డు నుంచి అమ్మవారి ప్రధాన గోపురం వరకు క్యూలైన్లు ఏర్పాట్లు చేశామన్నారు. గురువారాల్లో పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున శీఘ్ర దర్శనాలు జరిగేలా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆలయం వద్ద భక్తులకు అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశామన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. క్యూలైన్లలో ఉండే భక్తులకు మంచినీటి వసతి కల్పిస్తామన్నారు. వాహనాల పార్కింగ్ కోసం మున్సిపల్ స్టేడియం, విక్టోరియా ఆసుపత్రి ఆవరణ, కొత్త రోడ్డు ఆర్చ్ గేట్ వద్ద సదుపాయం కల్పించినట్లు చెప్పారు.

సేవా రుసుము టిక్కెట్లు: ఉచిత దర్శనంతోపాటు రూ.100, 200, 500 టిక్కెట్ దర్శనాలను అందుబాటులో ఉంచినట్లు కార్యనిర్వహణాధికారిణి శోభారాణి చెప్పారు. వీటితోపాటు సేవాటిక్కెట్లు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. పంచామృతాభిషేకానికి రూ.7,500, సాధారణ రోజుల్లో రూ.2,500 రుసుము నిర్ణయించామన్నారు. డిసెంబరు 22న చతుర్వేద సభ, అర్చక సదస్సు, 23న నాదస్వర కచేరి, 26న సహస్ర ఘటాభిషేకం, మహాఅన్నదానం, 28న అంబికాబాక్ నుంచి రథయాత్ర ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని వివరించారు. ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రమణ, ఆలయ సిబ్బంది, వేద పండితులు పాల్గొన్నారు.

## వుడా పార్కులో సమస్యల పరిష్కారానికి కృషి



పార్కులో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న ప్రణవ్ గోపాల్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

పెదవాల్తేర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వుడా పార్కులో అన్ని సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, తూర్పునియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తెలిపారు. శుక్రవారం ఉదయం ఉడా పార్కును వారిద్దరూ పరిశీలించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో ముచ్చటించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ వాకింగ్ ట్రాక్ బాగా లేదని, వ్యాయామ పరికరాలు పాడయ్యాయని పలువురు ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ప్రణవ్ గోపాల్ అధికారులను పిలిచి వెంటనే ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తప్పక చర్యలు తీసుకుంటామని ప్రణవ్ గోపాల్, రామకృష్ణబాబు కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే పట్టాభిరామ్,. ప్రధాన ఇంజనీరు భవాని, డీఎఫ్‌వో శివాని, కార్యనిర్వాహక ఇంజనీర్లు రామరాజు, ఎస్వీఎస్ఎన్ రాజు, సత్యనారాయణ, శంకరరావు, టీడీపీ నాయకులు పోతన్న రెడ్డి, తెడ్డు రాజు, అమరేంద్ర, మూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసీ కళాశాలను సందర్శించిన పూర్వ విద్యార్థులు



ఏయూ వీసీని కలిసి ముచ్చటిస్తున్న ఫార్మసీ పూర్వ విద్యారులు

వెంకోజీపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఫార్మసీ కళాశాలను 1974-78, బ్యాచ్ బి.ఫార్మసీ పూర్వ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు తమ కళాశాలలోని పూర్వ, నూతన భవంతిలో అన్ని తరగతి గదులు, ప్రయోగశాలలను వీక్షించారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న బి.ఫార్మసీ విద్యార్థులతో ముచ్చటించారు. పూర్వ విద్యార్థులలో కె.రామయ్య, ఎస్.కృష్ణంరాజు ఫార్మసీ పాత భవనం మొత్తం 1వ అంతస్థు పునరుద్ధరణకు స్పాన్సర్ చేశారు. ఇప్పటికే కె.రామయ్య సహకారంతో 1వ అంతస్థులోని గ్యాలరీ పునరుద్ధరణ పూర్తయింది. ఫార్మసీ కళాశాల పాత బ్లాకు పునరుద్ధరణకు సహకరించాలని ఇతర పూర్వ విద్యార్థులు ఆసక్తిని వ్యక్తం చేశారు. అలాగే పూర్వవిద్యార్థులు ఆంధ్రా విశ్వవిద్యాలయ వీసీ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కలిసిరావాలని కోరారు. వీసీకి ఫార్మసీ కళాశాల పునరుద్ధరణ పనుల గురించి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.గిరిజా శంకర్ వివరించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల అధ్యాపకులుపాల్గొన్నారు.

## మహిళల వెయిట్ లిఫ్టింగ్ టోర్నీలో ఏయూకు రన్నరప్ ట్రోఫీ



విజేతలతో వైస్‌చాన్సలర్ శశిభూషణరావు, ఇతర ప్రముఖులు

విశాఖపట్నం స్పోర్ట్సు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల వెయిట్ లిఫ్టింగ్ టోర్నీలో ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టు రన్నరప్‌గా నిలిచింది. గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన సౌత్, వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నీలో ఏయూ లిఫ్టర్లు ఎస్.పల్లవి-స్వర్ణ పతకం, ఎ.రేవతి-రజత పతకం, బి.ఝాన్సీ-కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు, రెక్టార్ ఆచార్య కిశోర్‌బాబు, స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఆచార్య ఎన్.విజయ్ మోహన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్సు సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ ఎ.పల్లవి తదితరులు పతక విజేతలను, కోచ్, మేనేజర్ డాక్టర్ వై.శ్రీనివాసరావును అభినందించారు.

## జాతీయ కరాటే టోర్నీకి ముగ్గురు ఎంపిక


గోవర్థన్, తీర్థి, రాజేశ్వరిలను అభినందిస్తున్న కరాటే సంఘ అధ్యక్షుడు సతీష్‌కుమార్

విశాఖపట్నం స్పోర్ట్సు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన వాడో కై కరాటే డో క్రీడాకారులు ఎంపికయ్యారు. బోపాల్‌లో జరిగే సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల కరాటే టోర్నీకి ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికైన చిత్తూరు గోవర్ధన్..60 కిలోల విభాగంలో ప్రాతినిధ్యం వహించనున్నాడు. అలాగే చెన్నైలో జరిగే సౌత్ వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీ కరాటే టోర్నీలో మహిళల 45 కిలోల విభాగంలో ఎ.రాజేశ్వరి, ఢిల్లీలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కరాటే టోర్నీలో అండర్-17 బాలికల విభాగంలో సరభా తీర్థి ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా వాడో కై కరాటే డో అధ్యక్షుడు చిగురుపల్లి సతీష్‌కుమార్ శుక్రవారం తన కార్యాలయంలో క్రీడాకారులను అభినందించి జాతీయ టోర్నీలో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందజేసి, పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.


## ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1న బీఎస్పీ మహా ధర్నా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకుడు రాజారావు

డాబాగార్డెన్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను నిరసిస్తూ విశాఖలో డిసెంబరు 1న బీఎస్పీ మహా ధర్నా నిర్వహించనున్నట్టు ఆ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జ్ ఎల్.రాజారావు తెలిపారు. శుక్రవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 32 మంది బలిదానంతో స్టీల్‌ప్లాంట్ ఏర్పడిందన్నారు. ఈ పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరారు. బీఎస్పీ మహా ధర్నాకు పార్టీ జాతీయ సమన్వయకర్త రాంజీ గౌతమ్ హాజరు కానున్నారన్నారు. ఐదు లక్షల కుటుంబాలపై ప్రత్యక్ష ప్రభావం చూపే ప్రైవేటీకరణ ఎట్టిపరిస్థితుల్లోనూ జరగకుండా అందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ స్థాపనకు చేసిన ఉద్యమ స్ఫూర్తితో నేడు కాపాడుకోవడానికి మళ్లీ ఉద్యమం చేద్దామన్నారు. ఇకపై స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాల్లో బీఎస్పీ పాల్గొంటుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్యం, రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్‌రావు, జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, రాష్ట్ర కన్వీనర్ కట్ట మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు భరోసా


బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న జనసేన నాయకులు

మహారాణిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు అండగా ఉంటామని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. కోస్టల్ బ్యాటరీ ఎదురుగా ఉన్న జాలారిపేట గాంధీబొమ్మ వెనుక ప్రాంతంలో ఈ నెల 21న తెల్లవారు జామున మత్స్యకారులకు చెందిన నాలుగు బడ్డీలు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. చేపల వేటకు సంబంధించిన వలలు, ఇతర సామగ్రిని అందులో ఉంచుకునేవారు. ప్రమాదంలో అవి కూడా కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ తన వంతుగా రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని జనసేన నాయకుల ద్వారా బాధితులకు అందజేశారు. స్థానిక మత్స్యకార సంఘం నాయకులు నొల్లు మురళి, చింతపల్లి పోతురాజు, కాసారపు వాసు, జయకుమార్ ఉసిరికాయలు, యజ్ఞశ్రీ పాల్గొన్నారు.

# మార్గశిర మాసోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

**» కనకమహాలక్ష్మి ఆలయం వద్ద భక్తులకు సౌకర్యాలు » ప్రత్యేక దర్శనాల సౌకర్యం » ఈవో శోభారాణి వెల్లడి**


అధికారులతో కలిసి ఉత్సవాల గోడప్రతిని ఆవిష్కరిస్తున్న ఈవో శోభారాణి

జగదాంబ కూడలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్యనిర్వహణాధికారిణి కె.శోభారాణి తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. డిసెంబరు 2 నుంచి 30 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. 2న ఉదయం 8 గంటలకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తొలిపూజతో ప్రారంభిస్తారని తెలిపారు. టౌన్ కొత్తరోడ్డు నుంచి అమ్మవారి ప్రధాన గోపురం వరకు క్యూలైన్లు ఏర్పాట్లు చేశామన్నారు. గురువారాల్లో పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున శీఘ్ర దర్శనాలు జరిగేలా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆలయం వద్ద భక్తులకు అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశామన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. క్యూలైన్లలో ఉండే భక్తులకు మంచినీటి వసతి కల్పిస్తామన్నారు. వాహనాల పార్కింగ్ కోసం మున్సిపల్ స్టేడియం, విక్టోరియా ఆసుపత్రి ఆవరణ, కొత్త రోడ్డు ఆర్చ్ గేట్ వద్ద సదుపాయం కల్పించినట్లు చెప్పారు.

**సేవా రుసుము టిక్కెట్లు:** ఉచిత దర్శనంతోపాటు రూ.100, 200, 500 టిక్కెట్ దర్శనాలను అందుబాటులో ఉంచినట్లు కార్యనిర్వహణాధికారిణి శోభారాణి చెప్పారు. వీటితోపాటు సేవాటిక్కెట్లు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. పంచామృతాభిషేకానికి రూ.7,500, సాధారణ రోజుల్లో రూ.2,500 రుసుము నిర్ణయించామన్నారు. డిసెంబరు 22న చతుర్వేద సభ, అర్చక సదస్సు, 23న నాదస్వర కచేరి, 26న సహస్ర ఘటాభిషేకం, మహాఅన్నదానం, 28న అంబికాబాక్ నుంచి రథయాత్ర ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని వివరించారు. ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రమణ, ఆలయ సిబ్బంది, వేదపండితులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు చర్యలు


రహదారి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు

కంచరపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 47వ వార్డు పరిధి రాంజీ ఎస్టేట్ బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం నుంచి స్లీపరీకాలనీ వరకు చేపట్టే సీసీ రోడ్డు పనులను ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండవాలు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రూ.34 లక్షలతో ఈ రోడ్డు నిర్మిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల మంజూరైన దరఖాస్తుదారుల విషయమై నిర్ణయం తీసుకునేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, అలాంటి వారు ఎవరైనా ఉంటే తమ కార్యాలయంలో సంప్రదించాలని విష్ణుకుమార్‌రాజు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసన్న, ఏఈ అర్చన, కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, టీడీపీ నాయకులు ఈతలపాక సుజాత, ఆదిలక్ష్మి, రాజారావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## అసోంపై విదర్భ విజయం

విశాఖపట్నం స్పోర్ట్సు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరుగుతున్న సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టోర్నీలో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో విదర్భ ఎనిమిది వికెట్ల తేడాతో అసోంపై విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన అసోం 19.1 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌటైంది. దెనీష్ దాస్ (31), శంకర్‌రాయ్ (22), సాహిల్ జైన్ (21) మినహా మిగిలినవారు విఫలమయ్యారు. విదర్భ బౌలర్లలో దిపేష్ పర్వాని మూడు వికెట్లు తీయగా పర్త్ రెఖేడ్, యాష్ టాకూర్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విదర్భ 14 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు నష్టపోయి గెలుపొందింది. ఓపెనర్ కరుణ్‌నాయర్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగి అర్ధసెంచరీ (75; 8 ఫోర్లు, 4 సిక్సర్లు) సాధించగా, మందర్ మహలే (31 నాటౌట్) రాణించి జట్టుకు సునాయాసంగా విజయాన్ని అందించారు. క్రీడాభిమానులు ఆసక్తిగా తిలకించారు.

# పారిశుధ్యం మెరుగుకు పక్కాగా పర్యవేక్షణ

**జీవీఎంసీ కమిషనర్ ఆదేశం**


గెడ్డను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్ కుమార్, చిత్రంలో కార్పొరేటర్ శ్రావణి తదితరులు

అక్కయ్యపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి వార్డులో ఇంటింటా పారిశుధ్య కార్మికులు రోజూ వ్యర్థాలను సేకరించడం, ఈ పని సక్రమంగా జరుగుతున్నదీ, లేనిదీ బాధ్యులు పర్యవేక్షించడం పక్కాగా జరగాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. పారిశుధ్య కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్ వ్యర్థాలు సేకరించే వాహనాలతో వార్డుల్లో పర్యవేక్షించి వీధులు, కాలనీలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శుక్రవారం ఆయన 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణితో కలిసి అక్కయ్యపాలెం, చిన్నూరు, ఎన్‌జీజీఓస్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్య సమస్యలు, కాలువ నిర్మాణం, తాగునీటి సమస్యలపై కార్పొరేటర్ శ్రావణి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందిస్తూ వెంటనే బాధ్యులను ఆదేశించారు. పలుచోట్ల పబ్లిక్ కుళాయిలు వేయడం, ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతుల కోసం విద్యాశాఖకు లేఖ రాస్తూ, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కార్యనిర్వాహక ఇంజనీర్ గంగాధర్‌ను ఆదేశించారు. ఆయన వెంట అసిస్టెంట్ సిటీ ప్లానర్ సీహెచ్ మధుసూదన్‌రావు, సచివాలయాల కార్యదర్శులు ఉన్నారు..

## విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం


.కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సాగర్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి, పట్టుదలతో ప్రయత్నించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రాడిసన్ బ్లూ హోటల్‌లో సన్ కలర్స్ 2024 ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నచ్చిన రంగంలో రాణించాలంటే ఏకాగ్రత, పట్టుదల ముఖ్యమన్నారు. పర్యాటక రంగంలో విశేష అవకాశాలు, ఉపాధి లభిస్తుందని చెప్పారు. గౌరవ అతిథి కంకటాల మల్లికార్జునరావు మాట్లాడుతూ సన్ అంటే ఒక బ్రాండ్ అని, ఎందరో విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలబెట్టిన ఘనత ఈ విద్యా సంస్థకు దక్కుతుందన్నారు. సన్ సీఎండీ శ్రీకాంత్ జాస్తి మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం స్థాపించిన సన్ ప్రస్థానం రెండు శతాబ్దాలుగా కొనసాగడం ఆనందంగా ఉందని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశాజాస్తి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యతోపాటు క్రీడా, సంస్కృతి, పురాతన సంప్రదాయాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. నిర్వాహకులు ఎమ్మెల్యే గంటాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గంటా శారద, రవితేజ, నగరానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

## కేన్సర్ నివారణకు మెరుగైన వైద్య సేవలు


డాక్టర్‌ను సన్మానిస్తున్న సూపరింటెండెంట్, ప్రిన్సిపల్ తదితరులు

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సకాలంలో కేన్సర్‌ను గుర్తిస్తే మెరుగైన వైద్య సేవలు అందించి కోలుకునేలా చేయవచ్చని హెమటో పెథాలజిస్ట్ డాక్టర్ ఎం.ఉపేంద్ర శ్రీనివాస్ పేర్కొన్నారు. చేంజింగ్ ల్యాండ్‌స్కేప్ ఆఫ్ అంకాలజీ- మైక్రోస్కోపిక్ అండ్ అమిక్రోస్కోపిక్ అన్న అంశంపై ఆంధ్ర వైద్య కళాశాలలోని పానుగల్ బిల్డింగ్‌లో శుక్రవారం డాక్టర్ పీవీ జగన్నాథరావు స్మారక ఉపన్యాసమిచ్చారు. కేన్సర్ చికిత్సలో వచ్చిన అధునాతన వైద్య విధానాలను ఆయన వివరించారు. ఈ వ్యాధి పట్ల అవగాహనతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ సీవీ లక్ష్మి, పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రమాదాన్ని నివారించిన రైల్వే సిబ్బందికి సత్కారం

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణలో అంకితభావం ప్రదర్శించిన ట్రాక్ నిర్వహణ సిబ్బందిని డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు శుక్రవారం తన చాంబర్‌లో సత్కరించి అభినందించారు. కోరాపుట్-రాయగడ లైనులో కాకిరిగుమ-లక్ష్మీపూర్ బ్లాక్ సెక్షన్‌లో గూడ్స్ రైలుకు ప్రమాదాన్ని గుర్తించి అప్రమత్తంగా వ్యవహరించి ట్రాక్‌కు ఎలాంటి నష్టం కలగకుండా చాకచక్యం చూపిన ఎం.ప్రకాశరావు, గిరి, టుడులను అభినందించారు.

## భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి పూజలు


పుష్పాలంకరణలో నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి

మహారాణిపేట/అక్కయ్యపాలెం/సీతమ్మధార, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాసశివరాత్రి సందర్భంగా శుక్రవారం పరమశివుడికి మహారుద్రాభిషేకాలు, అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బీచ్‌రోడ్డులోని గోకుల్ పార్కు రాధాకృష్ణ ఆలయంలో ద్వాదశలింగ శత రుద్రాభిషేకం నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ ఈ నెల 27 నుంచి బొట్ట వెంకటరమణ, జయశ్రీ దంపతుల ఆధ్వర్యంలో యజ్ఞయాగాది కార్యక్రమాలు నిర్వహించారు. రుద్రాభిషేకం, అర్చన, మహాపూర్ణాహుతి నిర్వహించారు. సుమారు 2 వేల మందికి మహాఅన్నదానం చేపట్టారు. జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్కరమాని వెంకటరావు, టీఎస్‌టీయూసీ నాయకులు ఎ.అప్పల నారాయణ, జి.నరసింగరావు, ఎన్.కనకరాజు, పి.దుర్గారావు, జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అక్కయ్యపాలెం రామకృష్ణానగర్ కాళ్ళవారి తోటలోని రామలింగేశ్వరాలయంలో సామూహిక రుద్రాభిషేకం జరిగింది. అనంతరం 3 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. బీజేపీ నాయకురాలు శ్యామలాదీపిక ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, దాతలు దాసరి పరశురామయ్య, జయరాం, సబ్బిశెట్టి జగన్, కార్పొరేటర్ ముక్కా శ్రావణి, నరవ రాంబాబు, కాళ్ళ సూర్యప్రకాశ్, బొడ్డేటి రవికుమార్, కర్రి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు. నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మహా శివలింగానికి వెయ్యి ఎనిమిది బిందెల నీటితో అభిషేకం నిర్వహించారు. మృత్యుంజయ హోమం, సహస్ర ఘటాభిషేక పూజలను అర్చకులు రామారావు శర్మ, ఉర్జి మహేష్ శర్మలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది.

## అండర్ స్టాండింగే!

... 5వ పేజీ తరువాయి

ప్రాతిపదికన ఏర్పాటుచేసుకున్నామని, కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించాలని ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించేశారు. అలాగే చెట్ల వ్యర్థాల తరలింపునకు ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటుచేయడం వంటి అంశాలపై కూడా సభ్యులు కనీసం ప్రశ్నించలేదు. ఆయా కాంట్రాక్టర్లతో కొంతమంది సభ్యులు ముందుగానే అవగాహన కుదుర్చుకోవడం వల్లే సమావేశం ఆ విధంగా జరిగిందని అధికారులు అభిప్రాయ పడ్డారు. జోన్-8లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెంకటరావు వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా, కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం తీసుకుందామంటూ సభ్యులు వాయిదా కోరారు. అలాగే నిరాశ్రయుల వసతి గృహాల్లో సిబ్బంది సేవలు పొడిగింపు, ఆశ్రయం పొందే వారికి భోజన సదుపాయాలకు సంబంధించిన అంశాలను కూడా సభ్యులు స్వయంగా పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పి ఆయా అంశాలను వాయిదా వేయాలని మేయర్‌ను కోరారు. అలాగే 76వ వార్డులో రూ.49.74 లక్షలు వ్యయంతో డ్రెయిన్ నిర్మాణానికి అనుమతిచ్చే అంశంపై సభ్యులు వివరణ కోరగా, సదరు అధికారి అందుబాటులో లేకపోవడంతో అంశాన్ని వాయిదా వేశారు.

### 1న భగవద్గీత పఠన పోటీలు

జగదాంబ కూడలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్‌లోని గీతా ప్రసార సమితి కార్యాలయంలో డిసెంబరు 1న ఉదయం 9 గంటలకు భగవద్గీత 14వ అధ్యాయంపై పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రచార సమితి అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. విజేతలకు 8న బహుమతి ప్రదానం చేస్తామని వెల్లడించారు.

# వసతి ఓకే... ఆహారమే!

... 5వ పేజీ తరువాయి

వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించారు. మెరుగైన తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు నిర్మించారు. ఇంకా డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచడం ద్వారా పరిశుభ్ర వాతావరణం నెలకొల్పారు.

### రూ.8.7 కోట్లతో పనులు

సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని 12 వసతి గృహాలకు రూ.4 కోట్లు, బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని 11 వసతి గృహాలకు రూ.4 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఒక వసతి గృహానికి రూ.70 లక్షలు వెచ్చించి మౌలిక వసతులతో పాటు ఆధునికీకరణ పనులు చేపట్టారు. దీంతో స్పష్టమైన మార్పు కనిపించింది. ఈ చర్యలతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### మెనూ అమల్లో ఇబ్బందులు

ప్రస్తుతం కొన్ని వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం అందడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను అమలుచేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనంలో విద్యార్థులకు అందించాల్సిన ఆహార పదార్థాలతో ప్రభుత్వం మెనూ విడుదల చేసింది. ఈ మేరకు ఆహారం అందడం లేదు. చిక్కీలు, అరటిపండ్లు, రాగిజావ కొన్ని వసతిగృహాల్లో ఇవ్వడం లేదు. కొన్నిచోట్ల వండిన ఆహారంలో నాణ్యత లేదు. దీంతో తినలేని పరిస్థితి ఎదురవుతోందని విద్యార్థులు వాపోతున్నారు.

- కంచరపాలెంలోని గిరిజన సంక్షేమ శాఖకు చెందిన వసతిగృహంలో శుక్రవారం ఉదయం వడ్డించిన పెసర పప్పు పొంగలి గట్టిగా ఉండడంతో చాలామంది విద్యార్థులు తినలేదు. రాత్రిపూట వడ్డించే ఆహారంలో నాణ్యత ఉండడం లేదని, కూరలు రుచిగా ఉండడం లేదని పలువురు పేర్కొన్నారు.
- సీతమ్మధారలోని విద్యార్థులకు శుక్రవారం ఉదయం పెట్టిన కిచిడీ పులిహోరను తలపించింది. ప్రతిరోజూ సాయంత్రం రాగి జావ, స్నాక్స్ ఇవ్వాల్సి ఉండగా అప్పుడప్పుడు ఇస్తున్నారని విద్యార్థులు తెలిపారు.

### ఒకే గదిలో పది మంది..

చాలా వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించినప్పటికీ ఇంకా కొన్నింటిలో వసతి సమస్య ఎదురవుతోంది. మద్రిపాలెం జ్యోతినగర్‌లో రెండంతస్థుల ప్రైవేటు భవనంలో బీసీ సంక్షేమ శాఖ వసతిగృహం నడుస్తోంది. ఇందులో 120 మంది విద్యార్థులు ఉంటున్నారు. చిన్న గదిలో పదిమంది చొప్పున సర్దుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. కేవలం ఆరు మరుగుదొడ్లు మాత్రమే ఉండడంతో జీవీఎంసీ పబ్లిక్ టాయ్‌లెట్స్ దిక్కవుతున్నాయని చెబుతున్నారు.

### చాలని చార్జీలతో ఇబ్బంది..

ప్రస్తుతం ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రోజుకు రూ.53 చొప్పున మెస్ చార్జీలు ఇస్తోంది. పెరిగిన ధరలతో భోజనం పెట్టడానికి రూ.100 ఖర్చవుతోందని, ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో మెనూ అమలుచేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉండడం కూడా ఇబ్బందిగా పరిణమించిందని, సరకులు తెచ్చుకోలేకపోతున్నామన్నారు.

## గంజాయిపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

రోడ్డుపై వచ్చిపోయే వారిపై దాడులు చేస్తుండడంతో నగరవాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గత కొద్దిరోజులుగా నగరంలో పోలీసులకు భారీగా గంజాయి పట్టుబడుతోంది. ఈగల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు అందుబాటులోకి వస్తే నగరం మీదుగా గంజాయిని రవాణా చేస్తున్న స్మగ్లర్లు, వ్యాపారులతోపాటు గంజాయి వినియోగదారులకు చుక్కలు కనిపించడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## మహిళా ప్రయాణికులపై దాడి

... 5వ పేజీ తరువాయి

విశాఖ నుంచి గిడిజాల బయలుదేరింది. కంచరపాలెం ఐటీఐ జంక్షన్ దగ్గరకు వచ్చేసరికి ఓ వ్యక్తి యాసిడ్‌తో దాడి చేశాడంటూ ముగ్గురు మహిళా ప్రయాణికులు గగ్గోలు పెట్టడంతో డ్రైవర్ బస్సును నిలిపి, వారిని స్థానికుల సహాయంతో సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కంచరపాలెం సీఐ చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని జల్లిన ద్రవం యాసిడా? మరేదైనా? అని పరీక్షించారు. బాధితులు కళ్లు మంట పెడుతున్నట్టు చెప్పడంతో మెరుగైన వైద్యం కోసం మరో ఆస్పత్రికి పంపించారు. దాడికి పాల్పడిన వ్యక్తి వెంటనే అక్కడ నుంచి పరారవ్వడంతో పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. ఈ హడావిడి కారణంగా రోడ్డు మధ్యలో బస్సు ఆగిపోవడంతో గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ విషయంపై కంచరపాలెం పోలీసులను ప్రశ్నించగా యాసిడ్ దాడి కాదని పేర్కొన్నారు. మహిళలు కళ్లు మంటగా ఉన్నాయని చెప్పడంతో వైద్యం కోసం ఆసుపత్రికి తరలించామని చెప్పారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు.

## మధ్యాహ్న భోజన పథకం రేట్లు పెంపు

... 5వ పేజీ తరువాయి

సగటున రూ.90 లక్షలు ఖర్చు చేస్తున్నారు. వంట వండడం అంటే గ్యాస్ లేదా కట్టెలు, పప్పులు, కూరలు, ఇతర దినుసులు సంబంధిత వంట ఏజెన్సీ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం పెరిగిన రేట్లను పరిగణనలోకి తీసుకుని ప్రాథమిక విద్యార్థులకు రోజుకు రూ.8.00, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.12.00కు పెంచాలని వంట ఏజెన్సీలు డిమాండ్ చేస్తున్నాయి. తాజాగా పెంచిన రేట్లు కొంత వరకూ ఊరట కలిగించినా, పెరిగిన ధరలకు అనుగుణంగా లేవని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్షురాలు గూనూరు లక్ష్మి అన్నారు. వంట వండే కార్మికుల వేతనాలు కూడా పెంచి ఉంటే న్యాయం జరిగేదని అభిప్రాయపడ్డారు. కాగా మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి రేట్ల పెంపుపై ఎస్టీయూ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.పైడిరాజు హర్షం ప్రకటించారు.

### సెప్టెంబరు నుంచి అందని బిల్లులు

ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి వడ్డించే ఏజెన్సీలకు సెప్టెంబరు నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 9,10 తరగతి విద్యార్థులకు అక్టోబరు నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మధ్యాహ్న భోజన పథకం వండే సహాయకులకు సెప్టెంబరు వరకూ వేతనాలు మంజూరుచేశారు.

## నేడు అనంత పద్మనాభుని దీపోత్సవం

... 5వ పేజీ తరువాయి

మంత్రోచ్చారణలతో, పల్లకిపై ఊరేగింపుగా ప్రథమ పావంచా వద్దకు తీసుకువచ్చి ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై అధిష్ఠింపజేస్తారు. అనంతరం విశేష అర్చనలు చేసి భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు కొండపై జేగంట కొట్టగానే అప్పటికే మెట్లపై ఏర్పాటుచేసిన నూనె దీపాలను భక్తులు వెలిగిస్తారు. దీపకాంతులతో అనంతుని గిరి దేదీప్యమానంగా వెలుగొందడంతో భక్తులు ఆధ్యాత్మిక పారవశ్యంతో మునిగి తేలుతారు.

**ఉత్సవ నేపథ్యం:** పద్మనాభంలోని గిరి ప్రాంతంలో 1939లో అప్పటి విజయనగరం పాలకుడు పూసపాటి అలక్‌నారాయణ గజపతి ఆనతి మేరకు ద్రాక్షారామం నుంచి వచ్చిన చేకూరి సత్యనారాయణరాజు, బుల్లి సత్యనారాయణరాజు ఆశ్రమం ఏర్పాటు చేసుకున్నారు. ద్రాక్షారామం హోమగుండంలో లభ్యమైన త్రిపురసుందరీదేవి విగ్రహాన్ని తీసుకువచ్చి యజ్ఞ, యాగాదులు నిర్వహించేవారు. ఆఖరిరోజున అనంతుని కొండ మెట్ల పంక్తికి దీపోత్సవాన్ని నిర్వహించేవారు. కొంతకాలం తరువాత ఉత్సవం నిలిచిపోయింది. మళ్లీ 1987లో అప్పటి ఆలయ అర్చకులు రాకుధూటి కృష్ణమాచార్యులు (పెదబాబు) సూచనల మేరకు పునఃప్రారంభించారు.

**సర్వం సిద్ధం:** ఉత్సవానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరానుండడంతో 600 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం ఒంటి గంట తరువాత భారీ వాహనాలను దారి మళ్లిస్తారు. చిన్నాపురం జంక్షన్, నీలకుండీలు జంక్షన్, మహారాజ్‌పేట జంక్షన్ మీదుగా భక్తులను అనుమతిస్తారు. చిన్నాపురం జంక్షన్ నుంచి వచ్చే కార్లు, బైక్‌లకు జెడ్పీ అతిథిగృహం, మామిడి తోట, అర్చకునిపాలెం వద్ద, మహారాజపేట నుంచి వచ్చే వారికి తహసీల్దారు కార్యాలయం, పౌర సరఫరాల శాఖ గిడ్డంగి, స్ప్రింగ్ ఫీల్డు పాఠశాల వద్ద, నీలకుండీలు నుంచి వచ్చే వారికి పద్మనాభం వంతెన, గరానా సత్యనారాయణ ఖాళీస్థలం, చెరకు కాటా వద్ద పార్కింగ్‌కు స్థలాలు ఏర్పాటుచేశారు.

## ఏఎస్‌ఎం వైజాగ్ చాప్టర్ ప్రారంభం



వైజాగ్ చాప్టర్‌ను ప్రారంభిస్తున్న ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రదీప్ గోయల్

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ టెక్నాలజీ, మెటీరియల్ సైన్స్ రంగాల అభివృద్ధి కోసం అమెరికన్ సైన్స్ సొసైటీ ఫర్ మెటల్స్ (ఏఎస్‌ఎం) వైజాగ్ చాప్టర్‌ను ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్)లో శుక్రవారం ఏఎస్‌ఎం ఇంటర్నేషనల్ మాజీ ప్రెసిడెంట్, ప్రదీప్ మెటల్స్ ఛైర్మన్ ప్రదీప్ గోయల్, ఏఎస్‌ఎం ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ నవీన్ మంజూరన్ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏఎస్‌ఎం వైజాగ్ చాప్టర్ స్థాపన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా మెటలార్జీ కమ్యూనిటీని బలోపేతం చేసేందుకు ముందడుగు అని, మెటీరియల్ సైన్స్‌ను అభివృద్ధి చేయటానికి సహకార వేదికను ప్రోత్సహించడం ద్వారా తయారీదారులు, వ్యాపారులు, వినియోగదారులు, విద్యార్థులకు విలువైన అవకాశాలు సృష్టిస్తుందన్నారు. ఏఎస్‌ఎం వైజాగ్ చాప్టర్ ఇండస్ట్రీ, హెల్త్‌కేర్ ఇన్నోవేషన్‌ల మధ్య కీలకమైన వారధిగా ఉంటుందన్నారు. వైద్య పరికరాలు, డయాగ్నోస్టిక్స్ కోసం అత్యాధునిక మెటీరియల్ సొల్యూషన్‌లను వృద్ధి చేయటానికి కీలకపాత్ర పోషిస్తుందన్నారు.కార్యక్రమంలో ఏఎంటీజెడ్ ఎండీ డాక్టర్ జితేంద్రశర్మ పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

గాజువాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పాత గాజువాక జంక్షన్ సమీపంలో శుక్రవారం రాత్రి 10.50 గంటల సమయంలో లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు. పాతగాజువాక నుంచి కూర్మన్నపాలెం మార్గంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని అదే మార్గంలో వస్తున్న లారీ వెనక నుంచి ఢీకొంది. అతనిపై నుంచి లారీ వెళ్లిపోవడంతో శరీరం నుజ్జుయిపోయింది. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ద్విచక్ర వాహనం నెంబరు ఆధారంగా పరిశీలిస్తే శ్రీనగర్ ప్రాంతానికి చెందిన అప్పలనాయుడు అని చూపిస్తోందని, మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## లక్ష బిల్వార్చన

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ లోపల గల పురాతన శివాలయంలో మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం లక్ష బిల్వార్చన పూజ నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నేడు గురజాడ వర్ధంతి సభ

పెదగంట్యాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి సభ శనివారం వినాయక నగర్ నటాలి నాటక సంస్థ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈమేరకు సంస్థ కన్వీనర్ బంగార్రాజు ప్రకటన విడుదల చేశారు.

# చైతన్యనగర్.. ట్రాఫిక్ టెర్రర్

- విద్యా సంస్థలు, వ్యాపార కేంద్రం కావడంతో వాహనాల రద్దీ
- ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్
- పట్టించుకోని పోలీసులు

గాజువాక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గాజువాకలోని చైతన్యనగర్‌లో ట్రాఫిక్ పెద్ద సమస్యగా తయారైంది. చైతన్యనగర్ నుంచి గాజువాక జాతీయ రహదారికి, అటు కణితి రోడ్డుకు చైతన్యనగర్ రోడ్డు అనుసంధానంగా ఉండటంతో ఈ మార్గం నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. చైతన్యనగర్‌లో ఆరుకు పైగా కార్పొరేట్ కళాశాలలు, పదుల సంఖ్యలో పాఠశాలలు ఉండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఉదయం ఎనిమిది గంటల నుంచి తొమ్మిదిన్నర వరకు, సాయంత్రం నాలుగు నుంచి ఐదున్నర వరకు విద్యార్థులతో ఈ మార్గం నిండిపోతుంది. ఆ సమయంలో ఈ మార్గంలో ఆయా విద్యాసంస్థల వాహనాలు నిండిపోతాయి. వాహనాలు, విద్యార్థులతో చైతన్యనగర్ వీధులు, జాతీయ రహదారి మొత్తం నిండిపోతుంది. దీంతో ఈ రహదారి నుంచి నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు



వాహనాలతో నిండిపోయిన చైతన్యనగర్ రహదారి

నరకం చూస్తున్నారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యపై జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులకు స్థానికుల నుంచి ఫిర్యాదు అందాయి. అయితే సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవటం వల్లే ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ రహదారుల మొత్తం విద్యార్థులతో నిండిపోవటం వల్ల రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు అంటున్నారు.

ఇదిలావుండగా గతంలో ఓ జోనల్ కమిషనర్, ట్రాఫిక్ పోలీసులు విద్యాసంస్థలన్నీ ఒకే సమయానికి విడిచిపెట్టకుండా టైమింగ్స్ పాటించాలని సూచించడంతో అప్పట్లో కొంత మేర ట్రాఫిక్ సమస్య తీరింది. కొంత కాలం తరువాత ఇవేమి పట్టించుకోకపోవటంతో పరిస్థితి యథావిధిగానే మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కిక్కిరిసిన వాహనాలు

## త్రిశక్తి ఆలయంలో సహస్ర దీపాలంకరణ



సహస్ర దీపాలంకరణ

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్‌లో గల త్రిశక్తి అమ్మవార్ల ఆలయంలో కార్తీక చివరి శుక్రవారం పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయంలోని శ్రీమహాదుర్గ, శ్రీమహాసరస్వతి, శ్రీ మహాలక్ష్మి అమ్మవార్లను విశేషంగా అలంకరించి పూలంగి సేవ, నక్షత్ర సేవ, గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు ఆలయ ప్రధానర్చకులు ఫణిశర్మ నేతృత్వంలో సహస్ర దీపాలంకరణ అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తుల కోసం ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

## ఉక్కు ఆస్పత్రి హెచ్‌వోడీకి సత్కారం



ఉక్కు ఆస్పత్రి హెచ్‌వోడీ నవీన్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఇంటక్ నేతలు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకువిశేష సేవలందిస్తున్న ఆస్పత్రి హెచ్‌వోడీ ఏపీ నవీన్‌కుమార్‌ను ఇంటక్ నాయకులు శుక్రవారం సత్కరించారు. హెచ్‌వోడీగా బాధ్యతలు నిర్వహించిన తరువాత ఆస్పత్రిలో రోగులకు సేవలు అందించేందుకు చేసిన కృషి ప్రశంసనీయమని పలువురు నాయకులు కొనియాడారు. అందరి సహకారంతోనే సేవలు అందించగలుగుతున్నామని డాక్టర్ నవీన్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, నాయకులు మెడికల్ జగదీష్, ఆకుల నూకరాజు, రమణమూర్తి, గోపాలకృష్ణ, జెర్రిపోతుల మోహన్‌కుమార్, కారు రమణ పాల్గొన్నారు.

## పాలిథిన్ నిషేధంపై అవగాహన సదస్సులు

అగనంపూడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పాలిథిన్ వినియోగం ఆరోగ్యానికి హానికరమని గాజువాక జోనల్ ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. పాలిథిన్ వాడకంపై శుక్రవారం స్థానిక దుకాణదారులు, ప్రజలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నగరంలో పాలిథిన్ కవర్లు నిషేధించామన్నారు. పాలిథిన్ వాడకం వల్ల కేన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పాలిథిన్ కవర్లను నిషేధించి గుడ్డ, నార సంచులను వినియోగించాలన్నారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానటరీ ఇన్‌స్పెక్టర్లు సీతారామయ్య, కోటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అగనంపూడిలో అవగాహన కలిగిస్తున్న ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్




నాతయ్యపాలెంలో విద్యార్థులకు అవగాహనకల్పిస్తున్న అధికారులు

### అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం : ప్లాస్టిక్ వినియోగం వలన ఏర్పడే అనర్థాలపై మలేరియా నిర్మూలన విభాగం, గాజువాక పారిశుధ్య విభాగం సిబ్బంది నాతయ్యపాలెంలో శుక్రవారం స్థానిక విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతు ప్లాస్టిక్ వాడకం నిషేధాన్ని అందరూ బాధ్యతగా తీసుకున్ననాడే పర్యావరణాన్ని పరిరక్షించుకోగలమన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు అదికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పెండింగ్ సమస్యల పరిష్కారానికి వినతి



జీవీఎంసీ కమిషనర్‌కు వినతపత్రం అందజేస్తున్న 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు

పెదగంట్యాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 65వ వార్డులోని పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. యూజీడీ మ్యాన్ హోల్ రోడ్డు తక్కువ ఎత్తులో ఉన్నాయని, దీనివల్ల రాత్రివేళలో ప్రయాణించే పాదచారులు, వాహనచోదకులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. అందువల్ల మ్యాన్‌హోల్ పైకప్పులు రోడ్డుతో సమానంగా ఉండేటట్టు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన కమిషనర్ దీనిపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు కార్పొరేటర్ తెలిపారు.

## హైందవ శంఖారావం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పెదగంట్యాడ విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

పెదగంట్యాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) :విశ్వహిందూ పరిషత్తు (వీహెచ్‌పీ) పెదగంట్యాడ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చలో విజయవాడ హైందవ శంఖారావం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశాఖ విభాగ్ శారీరక ప్రముఖ్ మంతా సుబ్బారావు మాట్లాడుతూ జనవరి 5న చలో విజయవాడ హైందవ శంఖారం జరగనుందని తెలిపారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, బీజేపీ, బీఎంఎస్, ఆలయ అర్చకులు, పురోహితులు, పలు ధార్మిక సేవా సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్తు సభ్యులు పూజారి రమణయ్య, గొందేశి ఎరుకునాయుడు, అడపా కొండలరావు, గొందేశి గురప్ప, కదిరి గురునాథ్, పోలరాజు, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌బీ కాలనీకి బస్సులు పెంచాలి

పెదగంట్యాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ద్వారకా కాంప్లెక్సునుంచి పెదగంట్యాడ హెచ్‌బీ కాలనీకి రవాణా సౌకర్యాలు అందించే బస్సుల సంఖ్య పెంచాలని 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు గాజువాక డిపో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌ను శుక్రవారం కలిసి వినతపత్రం అందజేశారు. ముఖ్యంగా.. కళాశాల విద్యార్థులు రాకపోకలు సాగించే ఉదయం, సాయంత్రం వేళల్లో తగినన్ని బస్సులు అందుబాటులో లేకపోవడం వల్ల పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, ఈ విషయాన్ని గతంలో కూడా ఆర్టీసీ అధికారులకు తెలియజేయడం జరిగిందని పేర్కొన్నారు. హెచ్‌బీ కాలనీకి బస్సుల సంఖ్య పెంచాలని కోరారు.

## ఏయూలో ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ కోర్సు

వెంకోజీపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో నూతనంగా ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ కోర్సును ప్రారంభిస్తున్నారు. దీనికి సంబంధించి ఏయూతో అవెంటల్ లిమిటెడ్ అవగాహన ఒప్పందం చేసుకుంది. శుక్రవారం ఏయూ ఉపకులపతి జి.శశిభూషణరావు సమక్షంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, అవెంటల్ వైస్ ప్రెసిడెంట్ (టెక్నికల్) ఎన్.శ్రీనివాసరావు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు.

ఈ సందర్భంగా ఏయూ వీసీ మాట్లాడుతూ కోర్సులో 18 మందికి ప్రవేశాలు కల్పించనున్నట్టు తెలిపారు. మొదటి సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు రెండవ సంవత్సరంలో రూ.25 వేలు స్టైపెండ్ సైతం అందించనున్నట్టు చెప్పారు. అనంతరం విద్యార్థులకు రూ.9 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగ అవకాశాన్ని సైతం అవెంటల్ సంస్థ కల్పిస్తుందన్నారు. ఏయూలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి బీటెక్-వీఎల్‌ఎస్‌ఐ కోర్సును ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. దీనికి కేంద్ర ప్రభుత్వ ఐటీ శాఖ సహకారం అందిస్తుందన్నారు. పరిశ్రమలతో అనుసంధానం చేస్తూ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా నూతన కోర్సులను రూపకల్పన చేయనున్నట్టు చెప్పారు. అవంటెల్ లిమిటెడ్ అడ్వైజర్ డాక్టర్ నాగరాజన్ మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ అభ్యసనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అంతర్గతంగా ప్రేరణ పొందడం ఎంతో అవసరమన్నారు. టెక్నాలజీ వేగంగా మార్పునకు గురవుతోందని, ఎప్పటికప్పుడు తమ జ్ఞానాన్ని మెరుగుపరచుకోవడం ఎంతో అవసరమని చెప్పారు. సంస్థ ఉపాధ్యక్షులు (టెక్నికల్) ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏయూ చూపిస్తున్న చొరవ, సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళకు సీపీ ప్రశంస



తులసిని అభినందిస్తున్న సీపీ

కూర్మన్నపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):ఇంటి నుంచి తప్పిపోయిన అయిదేళ్ల బాలిక తన ఇంటిని గుర్తు పట్టలేక వడ్లపూడి కాలనీలో ఒంటరిగా తిరుగుతుండగా,కాలనీకి చెందిన జి. తులసి బాలికను తన వద్దకు తీసుకొని ఉంచి 112 పోలీస్ కంట్రోల్ రూంకు ఫోన్ చేసి సమాచారమిచ్చింది. పోలీసులు విచారణ జరిపి బాలికను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటన బుధవారం జరిగింది. సామాజిక బాధ్యత కలిగిన మహిళగా తులసిని గుర్తించిన నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ ఆమెను పోలీస్ కాన్ఫరెన్స్ హాలుకు ఆహ్వానించి అభినందించారు.

## సినిమా గైడ్

- **మెకానిక్ రాఖీ :** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **దేవకీనందన వాసుదేవ :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **జీబ్రా :** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **కంగువా :** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **లక్కీభాస్కర్:** వెంకటేశ్వర
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 48, టమాటా 46, వంకాయలు తెలుపు 32, నలుపు 34, బెండకాయలు 26, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 38, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 32, క్యారెట్ 50 దొండకాయలు 32, బంగాళదుంపలు 34, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది) 50, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోసకాయ 26, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 50, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 32, కంద 58,దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన 5, చుక్కకూర 4, పాలకూర 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

| కోడిగుడ్లు (నెక్) | (వంద - రూ.లలో) |
|---|---|
| విశాఖపట్నం | 585 |
| విజయనగరం | 589 |
| శ్రీకాకుళం | 589 |

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 105 |
| ఫారం ధర | 125 |
| విత్ స్కిన్ | 220 |
| స్కిన్‌లెస్ | 230 |

## షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

మల్కాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశ్‌నగర్‌లో ఉన్న షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. గౌరవాధ్యక్షుడిగా గోగు ప్రసాద్, అధ్యక్షుడిగా రావాడ అప్పారావు, ఉపాధ్యక్షుడిగా బడుగు సాయిచంద్, ప్రధాన కార్యదర్శిగా గుడాల ఈశ్వరరావు, సహాయ కార్యదర్శిగా కామాక నరసింగరావు, కోశాధికారిగా నందికోళ్ల శ్రీధర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కురకుల శంకర్రావు, ముద్దాడ శంకర్రావు,స్పోర్ట్స్ కార్యదర్శులుగా పులిపాటి రామారావు, సిమ్మిటి శేఖర్, కమిటీ సభ్యులుగా అనుకు అప్పారావు, గాలి అప్పారావు, కారు శంకర్రావును సభ్యులు ఎన్నుకున్నారు.

## గోపాలపట్నం సీఐగా అప్పారావు

గోపాలపట్నం,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ సీఐగా గొలగాని అప్పారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సోషల్ మీడియా సెల్‌లో పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన సురేశ్‌ను సోషల్ మీడియా విభాగానికి బదిలీ చేశారు. సీఐ అప్పారావుకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఇదే స్టేషన్‌లో ఎస్‌ఐగా పని చేసిన అనుభవం ఉండడంతో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారిస్తానని చెప్పారు.

## 'స్పర్శ్' సద్వినియోగం చేసుకోండి

మల్కాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సింధియా సమీపంలో ఉన్న ఈస్ట్ నేవల్ కమాండర్ ప్రధాన కార్యాలయం (తూర్పు నౌక దళం) పరిధిలో ఉన్న నేవల్ బేస్‌లో శుక్రవారం పించన్‌దారుల కోసం స్పర్శ్ ఔట్ రీచ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేవీ ఏరియా అకౌంట్స్ ఆఫీసర్ బి. బాల జవహర్ మాట్లాడుతూ స్పర్శ్ ప్రోగ్రామ్ ద్వారా పెన్షన్‌దారులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. డిఫెన్స్ అకౌంట్స్ డిపార్టుమెంట్ ప్రతిష్ఠాత్మకమైన ప్రోగ్రామ్‌లలో స్పర్శ్ ప్రోగ్రామ్ ఒకటని చెప్పారు. అనంతరం పింఛనుదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధికారులు చెంగలరావు, అబ్దుల్ ఆఫీజ్, కేజీఎస్‌వీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ, జీవీఎంసీ అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

# ఆక్రమణదారులపై ఉక్కుపాదం

- ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు
- ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు
- రెవెన్యూ, జీవీఎంసీ అధికారులతో సమీక్ష

పెందుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిని ఉక్కుపాదంతో అణిచివేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సుజాతనగర్‌లో ఉన్న దాట్ల కన్వెన్షన్‌లో ప్రభుత్వ స్థలాల ఆక్రమణల నియంత్రణపై రెవెన్యూ, జీవీఎంసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ భూమి గజం స్థలం ఆక్రమించినా.. సహించేది లేదన్నారు. రెవెన్యూ, జీవీఎంసీ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఆక్రమణలు జరు గుతున్నాయని చెప్పారు. ఆక్రమణల నియంత్రణ బాధ్యత సచివాలయం ఉద్యోగులదేనని స్పష్టం చేశారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు తప్పుడు పత్రాలతో ఆక్రమణదారులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ భూమి పరాధీనమైతే అందుకు బాధ్యులైన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారంలోనూ అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, జెడ్పీ హేమావతి, కార్పొరేటర్లు వసంత, రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావు , కూటమి నాయకులు సింహాచలం, దాట్ల మధు, కంచాపాటి మధు, పిన్నింటి పార్వతి, పిళ్లా జగన్మోహనపాత్రుడు,గొర్లె అప్పారావు, ఆర్‌ఎస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### 97వ వార్డులో పర్యటన

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శుక్రవారం ఉదయం 97వ వార్డులోని పులగాలిపాలెం, నరవవానిపాలెం, వికలాంగుల కాలనీ, దుర్గా ఆదర్శనగర్, అయ్యప్పనగర్, కుమ్మరి కాలనీల్లో సుడిగాలి పర్యటన చేశారు. కాలనీల్లో మౌలిక వసతులపై ఆరా తీశారు. తాగునీరు, విద్యుత్, డ్రైనేజీలు, రోడ్లను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి పారిశుధ్యం గురించి తెలుసుకున్నారు. వార్డులో ప్రభుత్వ భూముల ఆక్రమణకు గురవుతున్నాయని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కాలనీవాసుల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు, జెడ్పీ హేమవతి, టీడీపీ నాయకుడు అవగడ్డ అప్పలనాయుడు, జనసేన నాయకులు అయిత సింహాచలం నాయుడు, గొర్లె అప్పారావు, ఆర్‌ఎస్ నాయుడు, సేనాపతి సోమశేఖర్, కిశోర్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఏడీ కార్మికులపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

**గేటు వద్ద యూనియన్ నాయకుల ధర్నా**

ఎన్‌ఏడీ జంక్షన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సాకేతపురం ఎన్‌ఏడీ క్వార్టర్స్‌లో ఉన్న ఎన్‌ఏడీ కార్యాలయం ఎదుట ఎన్‌ఏడీ సీఈ యూనియన్ నాయకులు కార్మికుల సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ గేటు వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఎన్‌ఏడీ సీజీఎం నిరంకుశ వైఖరిని నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యాలయంలోకి వెళ్లే ప్రధాన మార్గానికి ఇరువైపులా ఎర్ర జెండాలు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఈ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఐదు రోజులుగా చేస్తున్న కార్మికుల సమ్మెకు నేవల్ డాక్‌యార్డ్, ఇతర రక్షణ రంగాలకు చెందిన వారు కూడా మద్దతు తెలిపారన్నారు. ఎన్‌ఏడీ సీజీఎం నిరంకుశ విధానాలను స్వస్తి చెప్పాలని, ఈనెల 22న 36 మంది కార్మికులను సస్పెండ్ చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ రెడ్డి వెంకటరావు, సీఈ యూనియన్ గౌరవ అధ్యక్షుడు థామస్, అధ్యక్షుడు నూకరాజు, కార్యదర్శి శ్రీనివాస్, రక్షణ రంగానికి చెందిన పలు యూనియన్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా శరగడం జన్మదిన వేడుకలు



శరగడంకు శుభాకాంక్షలు తెలుపుతున్న యువత

పెందుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు జన్మదిన వేడుకలు పెందుర్తిలో శుక్రవారం ఘనంగా జరిగాయి. పాత పెందుర్తిలో ఉన్న శరగడం స్వగృహంలో చిన అప్పలనాయుడు యువసేన ఆధర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. కేక్ కటింగ్ అనంతరం శరగడంను యువసేన నాయకులు గజమాలతో సత్కరించారు.

## ఆలయాల్లో మాస శివరాత్రి పూజలు

వేపగుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 93, 94 వార్డుల పరిధిలోని శివాలయాల్లో శుక్రవారం మాస శివరాత్రి పూజలు నిర్వహించారు. ప్రహ్లాదపురం దరి పల్లినారాయణపురంలో నూకాంబిక ఆలయ ఆవరణలో ఉన్న కాశీవిశ్వేశ్వర ఆలయంలో సామూహిక రుద్రాభిషేకం జరిపారు. అలాగే కృష్ణానగర్ గుడివీధిలో ఉన్న దుర్గా మల్లేశ్వరాలయం, రవినగర్ ఉమా శంకర్ ఆలయం, వేపగుంట కొండపై ఉన్న శివాలయం, ముత్యాలమ్మ గుడి ఆవరణలో ఉన్న శివాలయం, ప్రహ్లాదపురం ఆలయంలోనూ అభిషేకాలు, అర్చనలు చేశారు.90, 52వ వార్డుల్లోని శివాలయాల్లోనూ మాస శివరాత్రి పూజలు నిర్వహించారు. ఎన్‌ఏడీ గణేష్ నగర్‌లో శ్రీ ప్రమాద ఉమా విశ్వేశ్వర కుమార్ స్వామి దేవస్థానంలో శివునికి అభిషేకాలు పంచామృతాభిషేకాలు అర్చనలు చేశారు.

## నండూరుకి నివాళి

మల్కాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ వ్యవస్థాపకుడు, కార్మిక ఉద్యమాల రథసారధి నండూరు ప్రసాదరావు వర్ధంతి సభ మల్కాపురం సీటూ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సీటూ మల్కాపురం జోన్ అధ్యక్షుడు కె. పెంటారావు, తదితరులు నండూరు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు వి. బాబూరావు, ఆర్. లక్ష్మణమూర్తి మాట్లాడుతూ నండూరి ప్రసాదరావు కార్మికుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. ముఖ్యంగా హిందుస్థాన్ షిప్ యార్డులో మూడు సున్నాల ఒప్పందాన్ని రద్దు చేయించి, కార్మికులకు మంచి వేతనాలు అమలు చేయించడంలో కీలక పాత్ర వహించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జోన్ నాయకులు ఎన్. ఉమా, ఎం. కృష్ణారావు, కె. రమణ, బి. రాంబాబు, గొల్లబాబు రాము, శ్రీను, రైలు బాబు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# దూసుకుపోతున్న... ఫెమి రైడ్స్

ప్రయాణికులు, డ్రైవర్లూ మహిళలే...

- స్త్రీలకు శిక్షణ, ఉపాధి కల్పిస్తున్న సంస్థ
- దేశంలోనే మొదటిగా నగరంలో ప్రారంభం
- ప్రయాణంలో మహిళల భద్రతే ధ్యేయంగా ఏర్పాటు



**ప్రస్తుత సమాజంలో మహిళలు బయటకు అడుగు పెట్టాలంటేనే భయం వెంటాడుతోంది. ఇంటా బయటా మహిళలకు రక్షణ లేకుండా పోతున్న పరిస్థితుల్లో వారికి భద్రతతో కూడిన ప్రయాణాన్ని అందించాలని సంకల్పించారు నగరానికి చెందిన రాధికా బెహరా. ఆలోచన వచ్చిందే తడవుగా 'ఫెమి రైడ్స్' పేరుతో సంస్థను స్థాపించారు. ఒంటరిగా మహిళలు ప్రయాణించాల్సిన సందర్భాల్లో మహిళా రైడర్లే వారిని గమ్యస్థానాలకు చేర్చేలా ఔత్సాహికులను ప్రోత్సహించారు. బైక్, ఆటో, కారు డ్రైవింగ్‌లో తర్ఫీదునివ్వడంతో పాటు ఉపాధి కల్పిస్తున్నారు. ఈ వ్యవస్థను దేశంలోనే ప్రథమంగా నగరంలో అందుబాటులోకి తీసుకువచ్చి ఆదర్శంగా నిలుస్తున్నారు.**



నారీమణులు ఎన్ని విజయాలు సాధించినా సమాజ సంకెళ్ల వారిని వెనక్కి లాగుతూనే ఉన్నాయి. ఉద్యోగం, వ్యాపారంలో రాణించాలనుకునే వారిని ప్రోత్సహించే వారి కన్నా...నిరుత్సాహపరిచే వారే ఎక్కువ. అయితే రాధికా బెహరా ఇవేవీ పట్టించుకోలేదు. ప్రయాణ సమయంలోనైనా ఆడపిల్లలకు రక్షణగా నిలవాలన్న ఆలోచనలో నుంచి ఫెమి రైడ్స్‌కు రూపకల్పన చేశారు. ఇక్కడ ప్రయాణికులు, డ్రైవర్లు మహిళలే...ఔత్సాహిక మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణను అందించి, ఉపాధి కల్పించడం, సురక్షిత ప్రయాణం అందించడమే ఫెమి రైడ్స్ లక్ష్యం. ఎన్‌జీవో సంస్థలో మేనేజర్‌గా పనిచేసిన రాధికా బెహరా మహిళలను డ్రైవర్లుగా మార్చి, కేవలం మహిళా ప్రయాణికులకు మాత్రమే రవాణా సదుపాయం కల్పించాలని వినూత్న ప్రయత్నం చేశారు. ఈ ఏడాది మార్చిలో మధురవాడ, పెందుర్తి, గాజువాక ప్రాంతాల్లో ఫెమి రైడ్స్ సంస్థ ప్రారంభించారు. ఓలా, ఊబర్ మాదిరిగా కార్లు, ఆటోలు, బైక్‌ల ద్వారా మహిళా రైడర్లతో మహిళలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. ఇందుకు ఎలక్ట్రికల్ వాహనాలు మాత్రమే వినియోగిస్తున్నారు.

### మహిళలకు శిక్షణ... ఉపాధి

మహిళలు డ్రైవింగ్ చేయడమంటే కుటుంబ సభ్యులే కాదంటారు. ఈ నేపథ్యంలో వారిని నియమించే ప్రయత్నం చేయడంతో పెద్దగా స్పందన కనిపించలేదు. అప్పుడే రాధికా బెహరా మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణతో పాటు ఉపాధి కల్పిస్తామంటూ సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం చేశారు. దీంతో డ్రైవింగ్ నేర్చుకోవడానికి పదుల సంఖ్యలో మహిళలు ఆసక్తి చూపించారు. దరఖాస్తు చేసుకున్నవారి ఆసక్తి మేరకు కారు, ఆటో, బైక్ డ్రైవింగ్‌లో శిక్షణ అందించారు. అనంతరం ఫెమిరైడ్స్‌లో రైడర్లుగా ఉపాధి కల్పించారు. ఇప్పుడు 30 మంది మహిళలు కార్లు, ఆటోలు, బైక్‌లు నడుపుతూ మహిళలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు కుటుంబానికి ఆర్థిక ఆసరాగా కల్పిస్తున్నారు.

### ఆన్‌లైన్‌లో బుకింగ్..

మహిళా డ్రైవర్ల కోసం మహిళలు మాత్రమే ఫెమి రైడ్స్ వెబ్‌సైట్‌లో సంప్రతించాలి. వెబ్‌సైట్ ఓపెన్ చేసి కారు, బైక్, ఆటో ఏది ఎంపిక చేసుకుంటే దగ్గర్లో ఉన్న మహిళా రైడర్లు వారిని పికప్ చేసుకుని గమ్యస్థానాలకు చేర్చుతారు. తాజాగా యాప్ కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. దేశంలోనే మహిళల కోసం ఇలాంటి రవాణా సదుపాయం కేవలం విశాఖ నగరంలోనే అందుబాటులోకి రావడం విశేషం.



హైదరాబాద్, ముంబై, బెంగళూరు, ఢిల్లీ, కోల్‌కతా తదితర నగరాల్లో మహిళా డ్రైవర్లు ఉన్నప్పటికీ వారు అందరికీ రవాణా సేవలందిస్తున్నారు.

- మద్దిలపాలెం, ఆంధ్రజ్యోతి

### మహిళలు ముందుకురావాలి..



మహిళా రైడర్లతో మహిళలకు మాత్రమే రవాణా సదుపాయం కల్పించడం కోసం ఫెమి రైడ్స్ ఏర్పాటుచేశాం. రాష్ట్రంలోని ఇతర నగరాల్లో ఇలాంటి రవాణా కోసం ఫ్రాంచైజ్ కావాలని సంప్రతిస్తున్నారు. బ్యాంకులు కూడా వాహనాల కొనుగోలుకు రుణాలు ఇచ్చేందుకు ముందుకువస్తున్నాయి. నగరంలో డ్రైవింగ్ ఉద్యోగాలకు మహిళలు ఆసక్తి చూపడం లేదు. స్త్రీలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడానికి మహిళలే ముందుకు రావాలి. ఎవరు వచ్చినా డ్రైవింగ్ నేర్పించి పార్ట్‌టైం లేదా ఫుల్ టైమ్ జాబ్ చేసుకునే అవకాశం కల్పిస్తాం.

- రాధికా బెహరా, ఫెమిరైడ్స్ ఫౌండర్

### డ్రైవింగ్‌పై ఇష్టంతో శిక్షణ తీసుకున్నా...



ఉద్యోగం కోసం వెతుకుండగా సోషల్ మీడియాలో ఫెమి రైడ్స్ యాడ్ చూసి సంప్రతించాను. డ్రైవింగ్ మీద ఇష్టంతో శిక్షణ తీసుకుని, ఉద్యోగంలో చేరాను. రాపిడోలో చాలా మంది ఆడవారు బైక్‌లను బుక్ చేసుకుని ఇబ్బందిగా ప్రయాణిస్తున్నారు. ఫెమి రైడ్ ద్వారా అలాంటి వారిని పికప్ చేసుకుని డ్రాపింగ్ చేయడం సంతృప్తినిస్తోంది. నెలవారీ సంపాదనతో కుటుంబ ఆర్థిక పరిస్థితి కుదుటపడుతోంది.

- కె.రమ్య, బైక్ రైడర్

### ఏమనుకుంటారోనని భయపడ్డా



డ్రైవింగ్ అంటే ఇష్టం. ఫెమిరైడ్స్‌లో కార్ డ్రైవింగ్ నేర్పించి ఉద్యోగం ఇచ్చారు. ఎవరు ఏమంటారోనని భయపడ్డాను. కానీ ఏమనుకున్నా జాబ్ చేయాలని నిర్ణయించుకున్నాను. ఆడవారు ఎక్కడికైనా వెళ్లాలంటేనే భయపడుతున్నారు. సాయంత్రం మహిళలను పికప్ చేసుకుని వెళుతుంటే చాలా ఆనందంగా ఉంటోంది.

- ఎన్.భాగ్యలక్ష్మి, డ్రైవర్

### సంతృప్తికరంగా ఉంది



ఒంటరి మహిళలు వాహనాల్లో ప్రయాణానికి భయపడుతున్నారు. మహిళా డ్రైవర్లుగా గమ్యానికి చేర్చడం సంతృప్తి కలిగిస్తోంది. ప్రతిరోజూ చాలా మంది స్త్రీలను పికప్ చేసుకుని వెళ్తున్నా. వారంతా సురక్షితంగా ప్రయాణిస్తున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు రక్షణతో కూడిన ప్రయాణమే కాకుండా సంపాదన మెరుగుపడుతుంది. నా సంపాదనతో కుటుంబ అవసరాలు తీరుతున్నాయి.

- సోను, క్యాబ్ డ్రైవర్

## జూనియర్ సివిల్ జడ్జిగా సాయిమౌనిక ఎంపిక



విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ న్యాయవాది కొమ్మూరి సాయి మౌనిక జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఇటీవల హైకోర్టు నిర్వహించిన పరీక్షల్లో విజయం సాధించారు. జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం పట్ల జిల్లా న్యాయవాదుల సంఘం సభ్యులు, న్యాయమూర్తులు అభినందించారు.



## మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే చర్యలు

» కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బడి పిల్లలకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో పీఎం పోషణ్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం అమల్లో నాణ్యత ప్రమాణాల మేర సరిపడా భోజనం అందించడంలో రాజీ కూడదన్నారు. ఎంపీడీవోలు, హెచ్‌ఎంలు, అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. బీసీ, ఎస్సీ హాస్టళ్లలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతోందా లేదా అనేది తనిఖీ చేయాలన్నారు. వంట వండే పరిసరాలు, సహాయకులు పరిశుభ్రత పాటించాలన్నారు. వైద్యాధికారులు పాఠశాలలు తనిఖీచేసి ఐరన్ మాత్రలు, ఇతర మందులు పంపిణీ చేయాలని ఆదేశించారు. భోజనం కోసం నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని పౌరసరఫరాల సంస్థ డీఎంను ఆదేశించారు. మెనూ ప్రకారం వంట కోసం నాణ్యమైన కూరలు వండి పిల్లలకు అందించాలన్నారు. స్టోర్ రూమ్‌లో వంట వండే వస్తువులకు దగ్గరలో శానిటరీ వస్తువులు ఉంచరాదన్నారు. ప్రతి పాఠశాలలో కిచెన్‌గార్డెన్ పెంచాలని ఐసీడీఎస్ అధికారులకు ఆదేశించారు. కోడిగుడ్ల సరఫరాకు సంబంధించి మొదటి వారంలో నీలంరంగు, రెండో వారంలో పింకు రంగు, మూడోవారంలో పచ్చ రంగు, నాలుగోవారంలో బ్రౌన్ రంగు స్టాంపులు వేయాలన్నారు. సమీక్షలో డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి భాస్కరరావు, డీఎంహెచ్‌వో డాక్టరు జగదీశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

## నిర్మాణ రంగానికి సహకరిస్తాం

క్రెడాయ్ ప్రాపర్టీ షోలో ఎమ్మెల్యేలు గంటా, వెలగపూడి, విష్ణు, వంశీ

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల్లో నిర్మాణ రంగం అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వపరంగా సహకరిస్తామని ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లు హామీ ఇచ్చారు. ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో శుక్రవారం క్రెడాయ్ ప్రాపర్టీ షో-2024ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. స్టాళ్ల సందర్శించి విశాఖ అభివృద్ధికి మంచి ప్రాజెక్టులు వస్తున్నాయన్నారు. తూర్పు ఉత్తర, దక్షిణ ఎమ్మెల్యేలు వెలగపూడి, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ బ్రోచర్ విడుదల చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలోని సివిల్ ఇంజనీరింగ్ డిప్లమోలో మొదటి మూడు స్థానాలు దక్కించుకున్నవారికి కె.సుబ్బరాజు స్మారక అవార్డుల చెక్కులను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రెడాయ్ విశాఖ చైర్మన్ కేఎస్‌ఆర్‌కే రాజు, అధ్యక్షులు ధర్మేందర్, గౌరవ కార్యదర్శి వి.శ్రీను, రాష్ట్ర జనరల్ సెక్రటరీ బాయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.




క్రెడాయ్ ప్రాపర్టీ షోని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

## విద్యుత్ ఒప్పందాలతో రూ.1.1 లక్షల కోట్లు ఆదా

» మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వహయాంలో జరిగిన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.1.1 లక్షల కోట్లు ఆదా అవుతుందని మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. వైసీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సెకీతోనే ఒప్పందం చేసుకున్నామన్నారు. సీఎం చంద్రబాబు అధికధరలతో చేసుకున్న ఒప్పందాల వల్ల 25 ఏళ్లలో రూ.87,500 కోట్లు భారం పడుతుందన్నారు. తమ ప్రభుత్వం రూ.2.49కే యూనిట్ కొనుగోలుతో రూ.1.1 లక్షల కోట్లు ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిత్వహననానికే అక్రమాలంటూ ఆరోపణలు చేస్తున్నారని, చంద్రబాబుకు దమ్ముంటే ఈ ఒప్పందాలను రద్దుచేసుకోవాలన్నారు. టీడీపీ హయాంలో విండ్ పవర్ యూనిట్ రూ.4.83 చొప్పున కొనుగోలుకు 133, సోలార్‌పవర్ యూనిట్ రూ.5 చొప్పున 35 ఒప్పందాలు చేసుకున్నారన్నారు. ప్రస్తుతం దేశంలో ఎక్కడా రూ.2.7కి తక్కువ యూనిట్ ధర లేదని, ఐఎస్‌టీసీ మినహాయింపు లేకపోతే అదనంగా రూ.2 చెల్లించాల్సి వచ్చేదన్నారు. విద్యుత్‌కొనుగోలులో అవినీతికి సంబంధించి ఆధారాలు చూపాలన్నారు. కూటమి నాయకులు ఇచ్చిన ఫిర్యాదులపైనే పోలీసులు కేసు నమోదుచేస్తామనేలా వ్యవస్థను దిగజార్చారన్నారు.

## ప్రేక్షకాదరణ కొత్త ఉత్సాహాన్నిస్తోంది

» దేవకీనందన వాసుదేవ సక్సెస్ మీట్‌లో హీరో అశోక్

మద్దిలపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): లలితాంబిక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మించిన దేవకీనందన వాసుదేవ సినిమాకు ప్రేక్షకాదరణ బాగుందని హీరో అశోక్ గల్లా అన్నారు. ఈనెల 22న విడుదలైన చిత్రం సక్సెస్ మీట్ మద్దిలపాలెం కిన్నెర కామేశ్వరి థియేటర్‌లో శుక్రవారం నిర్వహించారు. హీరో కేక్ కట్ చేసి ఫ్యాన్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంచి సినిమాలకు తెలుగు ప్రేక్షకుల నుంచి ఆదరణ లభిస్తుందని ఈ సినిమాతో మరోసారి నిరూపించారన్నారు. తన తరువాతి సినిమాలను అభిమానులు ఆదరించాలని కోరారు.



ప్రేక్షకులకు అభివాదం చేస్తున్న హీరో అశోక్

## డ్రంకెన్‌డ్రైవ్ కేసుల్లో నలుగురికి జైలు

గాజువాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురికి జైలు శిక్ష, మరో 13 మందికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గాజువాక ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి పట్టుబడిన 17 మంది వాహనదారులను శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టారు. ఒకరికి నెలరోజులు, ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.50 చొప్పున జరిమానా విధించారు. కాగా మరో 13 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

## దాడి కేసులో నిందితుడికి జైలు

విశాఖపట్నం (లీగల్), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తిని గాయపరిచిన నేరానికి నిందితుడు రౌతు సతీష్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి గాయత్రి శుక్రవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.జగదీశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. కైలాసపురం శాంతినగర్‌కు చెందిన రౌతు సతీష్ అదే ప్రాంతానికి చెందిన పూడి సత్యనారాయణతో 2017 ఏప్రిల్ 25న గొడవకు దిగి, ఆయుధాలతో కొట్టాడు. బాధితుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

## అదుపులోకి రాని అతిసార

» జబ్బరుతోటలో మరో నలుగురికి డయేరియా

» మొత్తం బాధితుల సంఖ్య 53

మహారాణిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జబ్బరుతోటలో అతిసార అదుపులోకి రాలేదు. శుక్రవారం మరో నలుగురికి డయేరియా సోకడంతో చికిత్స పొందుతున్నారు. ఫిషింగ్ హార్బర్ సమీపంలోని జబ్బరు తోటలో ఈనెల 24 నుంచి ప్రబలిన అతిసార కారణంగా ఐదు రోజులుగా సుమారు 40 మంది ఆస్పత్రి పాలయ్యారు. శుక్రవారానికి బాధితుల సంఖ్య 53కి చేరింది. వ్యాధి లక్షణాలతో బాలిక మృతి చెందగా, మరో ఇద్దరు మూత్రపిండాల వ్యాధికి గురయ్యారు. దీంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అయినా వ్యాధి పీడితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. డయేరియాతో నాలుగేళ్ల బాలిక మృతి చెందిన విషయం వెలుగులోకి రావడంతో అధికారులు విచారణ చేపట్టారు. బాలిక తల్లిదండ్రుల స్వగ్రామం విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలోని పులిగడ్డ. మృతదేహాన్ని అక్కడకు తీసుకువెళ్లిపోవడంతో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, పోలీసు, ఇంటిలిజెన్స్ విభాగాల అధికారులు అక్కడికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, వ్యాధి బారిన పడి చికిత్స పొందుతున్న బాధితులను ఆదుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా కార్పొరేటర్, నాయకులు స్పందించలేదని అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

## సీఏబీ భవన నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్, తదితరులు

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మెడికల్ కళాశాల శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో సెంటి నరీ అలూమ్నీ బిల్డింగ్ (సీఏబీ) భవన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. రెండు నెలల్లో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులను ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, సీఏబీ ఫౌండర్ మెంబర్ డాక్టర్ టి. రాధ శక్రువారం పరిశీలించారు. రూ.50 కోట్ల వ్యయంతో నాలుగు అంతస్తుల్లో నిర్మిస్తున్న భవనం పనులు తుదిదశకు చేరుకున్నాయన్నారు.

## మానవ సేవే మాధవ సేవ



భిక్షాటన చేసుకునే దివ్యాంగునికి అన్నం తినిపిస్తున్న నరసింహాచార్యులు

మూడు చక్రాల కుర్చీలో కూర్చొన్న దివ్యాంగుడికి, అన్నం తినిపిస్తున్న వ్యక్తికి ఎటువంటి బంధుత్వం లేదు. అనాథ అయిన దివ్యాంగుడు ద్వారకా నగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద భిక్షాటన చేస్తుంటాడు. ఓ రోజు అటువైపుగా వెళుతున్న పురోహితుడు నరసింహాచార్యులకు ఆయన్ను చూసి జాలి కలిగింది. తన దగ్గరున్న ఆహారాన్ని స్వయంగా తినిపించారు. అప్పటి నుంచి అవకాశం ఉన్నప్పుడల్లా ఇంటి నుంచి ఆహారం తెచ్చి స్వయంగా తినిపించి వెళుతుంటారు. అలా తినిపిస్తుండగా ఆ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది. మానవ సేవే..మాధవ సేవ అంటే ఇదేనేమో.

- ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

## స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించిన ఉక్కు అదనపు కార్యదర్శి



మోడల్‌రూమ్ పరిశీలిస్తున్న సుభోద్‌కుమార్‌సింగ్

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌ను శుక్రవారం కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సుభోద్‌కుమార్‌సింగ్ సందర్శించారు. ఈడీ(వర్క్స్) కార్యాలయంలోని మోడల్ రూం, అవార్డు గ్యాలరీని, ప్రధాన విభాగాల్లో ఉత్పత్తి ప్రక్రియను పరిశీంచారు. అనంతరం ఉక్కు కార్మిక సంఘ నేతలతో సమావేశమయ్యారు. జీతాలు సరిగా ఇవ్వడం లేదని, ఆర్థిక ప్రయోజనాల్లో కోత విధించారని వారు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ మనుగడకు రూ.15వేల కోట్లు ఆర్థిక సాయం అందించాలని, బ్యాంకు రుణాలకు మారిటోరియం విధించాలని, సెయిల్ లేదా ఎన్‌ఎండీసీలో విలీనం చేయాలని కోరారు. సమావేశంలో ఇన్‌చార్జి సీఎండీ సక్సేనా, డైరెక్టర్లు, కార్మిక సంఘ నేతలు కేఎస్‌ఎన్.రావు, మంత్రి రాజశేఖర్, కారు రమణ, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి పాల్గొన్నారు.

## నేడు మానం ఆంజనేయులు అభినందన సభ

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంక్‌ను కోటి రూపాయలతో ప్రారంభించి ప్రస్తుతం రూ.7,665 కోట్లతో దక్షిణ భారతదేశంలోనే అత్యున్నత స్థానంలో నిలిపిన మానం ఆంజనేయులను అభినందించడానికి శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అక్కయ్యపాలెంలోని పోర్టు కళావాణి ఆడిటోరియంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి బ్యాంక్ సభ్యులు హాజరు కావాలని యాజమాన్యం ఓ ప్రకటనలో కోరింది.